



పల్నాడు, బాపట్ల జిల్లాల్లో వైసీపీ నాయకుల దాడిలో గాయపడ్డ టీడీపీ నాయకులు

చెలరేగిన వైసీపీ శ్రేణులు

- టీడీపీ నేతలే లక్ష్యంగా దాడులు

పోలింగ్ సరళితో బెంబేలెత్తిన వైసీపీ అభ్యర్థులు, నాయకులు అసహనంతో చెలరేగిపోయారు. పల్నాడు సహా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో దాడులు, దౌర్జన్యాలతో చెలరేగిపోయారు. పల్నాడు జిల్లాలో అయితే ఓటర్లను భయభ్రాంతులకు గురి చేశారు. గుంటూరు నగర పరిధిలోని పలు బూత్‌ల వద్ద వైసీపీ శ్రేణులు దౌర్జన్యాలు చేశాయి. అసహనం, ఆందోళనతోనే పలు ప్రాంతాల్లో అధికార పార్టీ నేతలు దౌర్జన్యాలు, దాడులకు దిగినట్లు తెలుస్తోంది.

దగ్గరుండి మంత్రి అంబటి రిగ్గింగ్

ముప్పాళ్ళ మండలం చాగంటివారిపాలెం పోలింగ్ బూత్‌లలో మంత్రి అంబటి రాంబాబు తన అనుచరులతో దగ్గరుండి మరీ రిగ్గింగ్ చేయించారు. అడ్డుకోబోయిన టీడీపీ శ్రేణులు, కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణపై వైసీపీ మూకలు రాళ్ల వర్షం కురిపించాయి. బూత్‌లోని వైసీపీ వారిని బయటకు తీసుకురావాలని రూరల్ సీఐ రాంబాబును కోరినా పట్టించుకోకపోవడంతో కన్నా అనుచరులు బూత్ లోపలికి వెళ్ళేందుకు ప్రయత్నించారు. దీంతో అంబటి అనుచరులు రాళ్లు, కర్రలతో టీడీపీ శ్రేణులపై దాడిచేశారు. దీంతో ఓ బాలుడితో పాటు ఐదుగురు గాయపడగా బాధితులను సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఇరువర్గాల దాడి.. సీఐకి గాయాలు

తాడికొండ మండలం నిడుముక్కలలో 83వ నెంబరు బూత్‌లో వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఆ తర్వాత టీడీపీ వార్డు మెంబరు నాగ స్వరూపపై దాడి చేసి ఆమె జాకెట్ చించి, తాళిబొట్టును తెంపుకుని ఇంట్లోని వస్తువులను కూడా ధ్వంసం చేశారు. దీంతో టీడీపీ శ్రేణులు అక్కడకు చేరుకోగా ఇరు వర్గాల మధ్య దాడులు జరిగాయి. రాళ్ల దాడిలో సీఐ ప్రభాకర్‌కి గాయాలైయ్యాయి. పోలీస్ బెటాలియన్ వచ్చి ఇరువర్గాలను చెదరగొట్టే ప్రయత్నం చేసినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. గుంటూరు అమరావతి రోడ్డుపై ఇరు వర్గాలు బైఠాయించి ఆందోళనకు దిగారు.



- దగ్ధమవుతున్న బహ్మారెడ్డి వాహనం



వెల్దుర్తి మండలం గొట్టిపాళ్లలో దగ్ధమవుతున్న జనసేన నేత వాహనం



పూర్తిగా దహనమైన ఎంపీ శ్రీకృష్ణదేవరాయల కారు



- అరవిందబాబు వాహనాన్ని ధ్వంసం చేసిన వైసీపీ మూకలు

ఓటెత్తారు..

- కేంద్రాల వద్ద జాతరను తలపించిన జనం
- ఉదయం నుంచి బూత్‌ల వద్ద ఓటర్ల బారులు
- ఈవీఎంల మొరాయింపు, ఆలస్యంగా ప్రారంభం
- పలు దగ్గర్ల కనీస సదుపాయాలు లేక అల్లాడిన జనం
- మధ్యాహ్నం వరకు మండిన ఎండ.. పలువురు ఇబ్బంది
- సాయంత్రానికి చల్లగా మారిన వాతావరణం, పలుచోట్ల వర్షం



- నరసరావుపేటలో ఓ పోలింగ్ బూత్‌లో బారులు తీరిన ఓటర్లు

గుంటూరు, బాపట్ల, నరసరావుపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): ఓటర్లు పోటెత్తారు.. మధ్యాహ్నం వరకు ఎండ మండింది.. ఓటమి భయంతో పోలింగ్ రోజూ వైసీపీ శ్రేణులు యథేచ్ఛగా దాడులకు తెగబడ్డాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రశాంతంగా జరిగే పోలింగ్ బూత్‌ల వద్ద ఈ సారి వీరంగం సృష్టించారు. వైసీపీ మూకలు ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినా.. బూత్‌ల వద్ద ఓటింగ్‌లో జాప్యం జరిగినా.. భానుడు భగభగ మండినా.. ఓటర్లు వెనుతిరగలేదు. ఓటేసి కాని వెళ్లేది లేదన్నట్లుగా భీష్మించుకున్నారు. ఓటరు చైతన్యం వెల్లివెరిసిందా.. అన్నట్లుగా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. మరోవైపు ప్రచారాలపై నిషేధం ఉన్నా వైసీపీ అభ్యర్థులు పలు దగ్గర్ల పట్టించుకోకుండా తమకు ఓటేయ్యాలంటూ, బూత్‌ల వద్ద టీడీపీ శ్రేణులు అల్లర్లు చేస్తున్నాయంటూ.. ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్‌తో పోలింగ్ రోజంతా హోరెత్తించారు. ఇతర రాష్ట్రాలే కాదు.. విదేశాల నుంచి వచ్చిన ఓటర్లు కూడా గంటల తరబడి నిరీక్షించి మరీ ఓటేశారు. 7 గంటలకు పోలింగ్ ప్రారంభ సమయం కాగా అంతకంటే ముందే వచ్చి ఓటర్లు బూత్‌ల వద్ద బారులు తీరారు. యువత, మహిళలు క్యూల్లో బారులు తీరారు. గేట్లు బయటే గుంపులు, గుంపులుగా ఉదయం ఆరు గంటల నుంచే పడిగాపులు కాశారు. భగభగమండే సూర్యుడు మధ్యాహ్నానికి శాంతించి చల్లబడడంతో ఓటర్లు సాయంత్రం వేళ పెద్ద సంఖ్యలో బూత్‌ల వద్దకు చేరుకున్నారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కావాల్సి ఉన్నా చాలా చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది. అర్ధరాత్రి 12 గంటల వరకు కూడా పలు కేంద్రాల్లో పోలింగ్ జరుగుతూనే ఉంది.

వెల్లివెరిసిన చైతన్యం.. విదేశాల నుంచి రాక

ఓటేయడానికి బారులు తీరినవారిలో యువత తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునే వారు పెద్ద సంఖ్యలో ఉండడం గమనార్హం. ఓటేయడానికి విదేశాల నుంచి కూడాపెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. కువైట్, ఐర్లాండ్, న్యూజిలాండ్, అమెరికా తదితర దేశాల నుంచి కూడా వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. గడచిన రెండు వారాలుగా భగభగమండుతున్న సూర్యుడు ఓటర్ల ఉత్సాహాన్ని చూసి సోమవారం తన ప్రచండాన్ని అంతగా చూపలేదు. పైగా మధ్యాహ్నం మూడు గంటల సమయంలో పలు నియోజకవర్గాల్లో వర్షం కురిసింది. గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని కొన్ని నియోజకవర్గాలతో పాటు బాపట్ల, వేమూరు పరిధిలో వాతావరణం చల్లబడింది. దీంతో సాయంత్రం వేళ ఓటర్లు మరింత ఉత్సాహంగా వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చిన ఓటర్లకు బూత్‌ల వద్ద సదుపాయాలు కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలమైంది. తాగునీటి సౌకర్యం కల్పించక పోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. చాలాదగ్గర్ల ఇరుకు గదుల్లో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు.

స్ట్రాంగ్‌రూంల్లో ఓటరు తీర్పు భద్రం

ఓటరు తీర్పు ఆదివారం రాత్రి నుంచి స్ట్రాంగ్‌రూంలకు చేరుకుంటున్నది. పోలింగ్ ముగిసిన కేంద్రాల నుంచి ఈవీఎంలను పోలీసు బందోబస్తు మధ్య రిసెప్షన్ సెంటర్లకు తీసుకొచ్చారు. పోలింగ్ ఆలస్యమైన ప్రదేశాల నుంచి ఈవీఎంలు అర్ధరాత్రి తర్వాత వచ్చాయి. గుంటూరు లోక్‌సభకు సంబంధించి నాగార్జున యూనివర్సిటీ, బాపట్ల, నరసరావుపేట కేంద్రాల్లోని రిసెప్షన్ కేంద్రాల వద్ద రద్దీ ఏర్పడింది. జిల్లా ఉన్నతాధికారులు రిసెప్షన్ సెంటర్లలో ఉండి ఈవీఎంలు భద్రంగా స్ట్రాంగ్‌రూంల్లోకి వెళ్లేంత వరకు మొత్తం ప్రక్రియని పర్యవేక్షిస్తున్నారు. అన్ని పోలింగ్ బూత్‌ల సామాగ్రి చేరుకున్న తర్వాత రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో సీళ్లు వేస్తారు.

దాడులతో అట్టుడికిన పల్నాడు జిల్లా

సాధారణంగా పల్నాడు అంటేనే ఉద్రిక్తత. అయితే ఈ సారి ఓటర్లు ఊహించిన విధంగా పోలింగ్ సందర్భంగా వైసీపీ విధ్వంసకాండ సృష్టించింది. ఎక్కడికక్కడ టీడీపీ శ్రేణులపై వైసీపీ మూకలు దాడులకు తెగబడ్డాయి. నరసరావుపేట, మాచర్ల, గురజాల, పెదకూరపాడు, సత్తెనపల్లి నియోజకవర్గాల్లో వైసీపీ అరాచకాలను సృష్టించి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసింది. పోలింగ్ ప్రారంభం నుంచే పథకం ప్రకారం వైసీపీ అభ్యర్థులు బరితెగించారు. ప్రశాంత ఓటింగ్‌కు భంగం కలిగించారు. టీడీపీ సానుభూతి పరులను ఓటింగ్‌కు రాకుండా అడ్డుకునే చర్యల్లో భాగంగానే అరాచకాలను అమలు చేసినట్లు సమాచారం. పోలింగ్ కేంద్రాల వద్ద గొడవలు సృష్టించి లబ్ధి పొందేందుకు వైసీపీ అభ్యర్థులు పలు ప్రాంతాల్లో ప్రయత్నించారు. ఇందులో భాగంగానే దాడులకు తెగబడ్డారన్న విమర్శలు వచ్చాయి. మాచర్ల మండలం రెంటచింతలలో ప్రారంభమైన వైసీపీ దాడులు, అరాచకాలు, దౌర్జన్యాలు, విధ్వంసాలను పోలింగ్ ముగిసే వరకు యథేచ్ఛగా సాగించింది. దాడులను నివారించాల్సిన పోలీసులు చాలాచోట్ల చేతులెత్తేశారు. దీంతో ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు భయంగుప్పిట చిక్కుకున్నారు. రెంటచింతల మండలం పాలువాయిగేట్, తుమ్మకోట, జెట్టిపాలెం పోలింగ్ బూత్‌ల్లోని ఈవీఎంలను ధ్వంసం చేశారు. ప్రత్యామ్నాయ ఈవీఎంలను ఏర్పాటు చేసి సోమవారం రాత్రి వరకు పోలింగ్ నిర్వహిస్తూనే ఉన్నారు.

ముందస్తు చర్యల్లో పోలీసులు విఫలం

పల్నాడు జిల్లాతో పాటు నరసరావుపేట పట్టణంలో దాడులు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంలో పోలీసుల విఫలమయ్యారన్న విమర్శలు వచ్చాయి. దాడులు జరిగాక కూడా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోలేక పోయారు. ఇరు వర్గాలు మోహరించి ఉన్నా వారిని అక్కడి నుంచి పంపించి వేయడంలో పోలీసులు సరైన రీతిలో స్పందించలేదు.

కాసును తరిమిన ఓటర్లు

గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని నడికుడి ఓటర్లు పరుగులు పెట్టించారు. ఎన్నికల ప్రక్రియ పరిశీలించే పేరట అక్రమాలకు ప్రయత్నించిన ఆయన్ను ఓటర్లు ప్రశ్నించారు. తమనే ప్రశ్నిస్తారా అని ఆయన అనుచరులు దాడులకు ప్రయత్నించి, మహిళలను బూతులు తిట్టారు. దాంతో పోలింగ్ బూత్ లో ఉన్న ఓటర్లు ఎమ్మెల్యే కాసుకి ఎదురు తిరిగారు. మా ఊరు వచ్చి మామీదే దౌర్జన్యం చేస్తారా అనడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేస్తూ నోటికి వచ్చినట్లు బూతులు మాట్లాడారు. దీంతో అక్కడున్న ఓటర్లు రాళ్లు తీసుకుని వెంట పడటంతో కాసు అక్కడి నుంచి పరుగులు పెట్టారు.

- మాచర్లలో ఎమ్మెల్యే పిన్నెల్లి సోదరులు రెచ్చిపోయారు. మాచర్ల పట్టణంలో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి టీడీపీ కార్యకర్తలను కారుతో తొక్కించారు. ఈ సంఘటనలో ఐదుగురు టీడీపీ కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారు. ఆ తర్వాత ఓ టీడీపీ నేత ఇంటిని దగ్గరుండి ధ్వంసం చేయించారు. రెంటచింతల మండలం రెంటాలలో గుంటూరు రేంజ్ ఐజీ ఎదుటే జూలకంటి బ్రహ్మారెడ్డిపై వైసీపీ కార్యకర్తలు దాడి చేసి కళ్లలో కారం కొట్టి హత్యాయత్నానికి ఒడిగట్టారు. అనంతరం రెండు కార్లను ధ్వంసం చేసి ఓ కారును తగలబెట్టారు.
- దాచేపల్లిలో టీడీపీ కార్యకర్తలపై కర్రలతో దాడి చేసి వైసీపీ వర్గాలు గాయపరిచాయి. తంగెడలో బాంబులతో వైసీపీ వర్గాలు దాడులకు దిగాయి. ఎరికేపల్లిలో టీడీపీ కార్యకర్త వాహనాన్ని ధ్వంసం చేశారు.
- నరసరావుపేట మండలం దొండపాడులో వైసీపీ శ్రేణులు ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలుపై దాడి చేశాయి. ఆయన కాన్వాయ్‌లోని రెండు కార్లను ధ్వంసం చేశారు. పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ అభ్యర్థి అరవిందబాబుపై ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి అనుచరులు ఎమ్మెల్యే సమక్షంలోనే దాడి చేశారు. అరవిందబాబు కారుతో పాటు పలు కార్లను ధ్వంసం చేశారు. ఈ దాడులకు ప్రతిగా టీడీపీ శ్రేణులు కూడా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ఇంటి వద్ద ఉన్న కార్లను ధ్వంసం చేశాయి. గోపిరెడ్డి ఆస్పత్రి, టీడీపీ కార్యాలయంపై ఇరు పక్షాలకు దాడులు చేసుకున్నాయి. గుంటూరు రోడ్డులో రాళ్ల వర్షం కురిపించుకున్నారు. పరిస్థితిని అదుపుతోకి తెచ్చేందుకు పోలీసులు రబ్బరు తుటాలను ప్రయోగించారు. అటు అరవిందబాబు, ఇటు గోపిరెడ్డి ఆస్పత్రి వద్ద ఇరు వర్గాలు రాత్రి 9 గంటల వరకు మోహరించే ఉన్నాయి. చిలకలూరిపేట నుంచి వస్తున్న శ్రీకృష్ణ దేవరాయల కాన్వాయ్‌ను అడ్డుకున్న వైసీపీ శ్రేణులు ఓ కారులోని వారిని కిందకు దించి పెట్రోల్ పోసి తగలబెట్టారు. అరవిందబాబు, గోపిరెడ్డిలను హౌస్ అరెస్టు చేశారు.
- సత్తెనపల్లి నియోజకవర్గం తొండపి, రూపెనగుంట్ల, చీమలమర్రి, కుంకలగుంట, గుళ్లపల్లి గ్రామాల్లో రాళ్ల కర్రలతో టీడీపీ శ్రేణులపై వైసీపీ మూకలు దాడులు చేశాయి. ఈ సంఘటనలలో పలువురు కార్యకర్తలు గాయపడ్డారు. క్రోసూరు మండలం ఎర్రబాలెం, దొడ్లేరు గ్రామాల్లో పరస్పర దాడులు జరిగాయి.



- తెనాలిలో వర్షం నీటిలో ఓటువేసేందుకు నిలబడిన ప్రజలు



మాచర్లలో వైసీపీ కార్యకర్తల వీరంగం



టీడీపీ కార్యకర్తలపై రాళ్లు రువ్వుతున్న వైసీపీ కార్యకర్తలు



చిలకలూరిపేటలో ఓటు వేసి వస్తున్న పుల్లారావు



గుంటూరులో ఆనందబాబు దంపతులు



బాపట్ల, పొన్నూరులో వేగేశన, నరేంద్ర



పిడుగురాళ్లలో యరపతినేని దంపతులు



వినుకొండలో జీవీ ఆంజనేయులు దంపతులు



సత్తెనపల్లిలో కన్నా, రేపల్లె అనగాని



మాచర్లలో బ్రహ్మారెడ్డి, తెనాలిలో మనోహర్



గుంటూరులో లావు, పెదకూరపాడులో ప్రవీణ్, నరసరావుపేటలో అరవిందబాబు, బుర్రిపాలెంలో ఎంపీ అభ్యర్థి పెమ్మసాని, గుంటూరు తూర్పులో నసీర్, పశ్చిమలో మాధవి, మంగళగిరిలో లోకేశ్, ప్రత్తిపాడులో రామాంజనేయులు

దిక్సూచి

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ఏటా ప్రపంచవ్యాప్తంగా పది బిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలు వాతావరణంలోకి విడుదలవుతున్నాయని అంచనా. దానిలో 30 శాతం అంటే మూడు బిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలనే మహాసముద్రాలు శోషించుకుంటాయి. అందువల్ల సముద్ర పర్యావరణాన్ని అతిపెద్ద కార్బన్ సింక్‌గా చెప్పుకుంటాం. భూ వాతావరణాన్ని రక్షిస్తున్న సముద్ర పర్యావరణానికి చేపలవేట, సముద్రాంతర్గత ఖనిజోద్ధహణం వంటి మానవ కార్యకలాపాలు తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయి.



మహా సముద్రాల్లో జీవవైవిధ్య పరిరక్షణ

హై సీస్ ప్రాంతం అంటే సముద్ర తీర దేశాల ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్ పరిధి(తీరం నుంచి 200 నాటికల్ మైళ్లు)ని దాటి విస్తరించిన 'జాతీయ పరిధుల వెలుపలి సముద్ర ప్రాంతం'. దీని సంరక్షణకు సరైన అంతర్జాతీయ చట్టాలు అమలులో లేవు. భూగోళంలో దాదాపు సగం విస్తీర్ణంలో ఉన్న హైసీస్(జాతీయ పరిధుల వెలుపలి సముద్రం ప్రాంతం)లో కేవలం 1.44% మాత్రమే పరిరక్షిస్తున్నారని యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ద లా ఆఫ్ సీస్(యూఎన్‌సీఎల్ఓఎస్) నివేదిక తెలుపుతోంది. అంటే 99 శాతం హైసీస్ ప్రాంతం ఎటువంటి పరిరక్షణకు నోచుకోవడం లేదు.

వాతావరణ మార్పులను సమర్థవంతంగా ఎదుర్కొని సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించాలంటే భూగోళంలో సగభాగంగా ఉన్న హైసీస్ ప్రాంతాన్ని, అక్కడి సముద్రాంతర్గత పర్యావరణాన్ని రక్షించాల్సిన ఆవశ్యకత ఉంది. అదీ కాక సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో 14వది అయిన 'లైఫ్ బిలో వాటర్' అనే ప్రత్యేక లక్ష్యం, సముద్రాంతర్గత పర్యావరణ రక్షణకు సంబంధించి ప్రత్యేకంగా తీర్మానించింది. కాబట్టి సముద్రాంతర్గత పర్యావరణ పరిరక్షణకు ఒక అంతర్జాతీయ ఒడంబడిక అవసరం ఏర్పడింది. ఈ దిశగా చర్యలు చేపట్టడానికి 2022 డిసెంబరులో కెనడాలోని మాంట్రియెల్ నగరంలో కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్(సీఓపీ)-15లో 'కున్‌మింగ్ - మాంట్రియెల్ గ్లోబల్ బయోడైవర్సిటీ ఫ్రేమ్ వర్క్'ను ఆమోదించారు. 2030 నాటికల్లా భూమి, సముద్ర పర్యావరణ ప్రాంతంలో 30 శాతాన్ని పరిరక్షించాలని ఈ ఫ్రేమ్‌వర్క్ నిర్దేశిస్తుంది. దీనినే '30x30 వ్యూహం'అని కూడా అంటారు. ఈ వ్యూహం అమలు కోసం అన్ని సముద్రతీర దేశాల మద్దతు కూడగట్టడానికి 'యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ద లా ఆఫ్ ద సీ' ప్రాధికారితన 'ట్రీటీ ఆఫ్ హైసీస్/బయోలాజికల్ డైవర్సిటీ ఇన్ ఏరియాస్ బియాండ్ నేషనల్ జ్యూరిస్‌డిక్షన్(బీబీఎన్‌జే) ట్రీటీ'ని 2023 మార్చిలో ప్రవేశపెట్టారు. ఈ ఒప్పందంపై అంగీకార సంతకాలు చేయడానికి తీర దేశాలన్నింటికీ 2023 సెప్టెంబరు 20 నుంచి 2025 సెప్టెంబరు 20 వరకు గడువు నిర్దేశించారు. కనీసం 60 దేశాలు ఈ ఒప్పందంపై సంతకం చేసి, దానిని ర్యాటిఫై చేసినప్పుడే ఇది అమలులోకి వస్తుంది. అంటే సంతకాలు చేసిన దేశాలు, తమ దేశంలోని సంవిధానాలకు అనుగుణంగా ఆ ఒప్పందానికి చట్టపరమైన ధృవీకరణను ప్రకటించాల్సి ఉంటుంది.(ఉదాహరణకు పార్లమెంటు ఆమోదం). ఈవిధంగా 88 దేశాలు ఇంతవరకూ బీబీఎన్‌జే ఒప్పందంపై సంతకాలు చేశాయి. రెండు దేశాలు(చిలీ, పలావూ) మాత్రమే ర్యాటిఫై(చట్టపర ధృవీకరణ) చేశాయి. భారత్ సహా మిగతా 86 దేశాలు ర్యాటిఫై చేయాల్సి ఉంది. గడువు కాలం సమీపిస్తుండటంతో సంతకాలు చేసిన దేశాలను ర్యాటిఫై చేసే దిశగా ప్రోత్సహించడానికి 2024 మార్చి 7న బెల్జియంలో 'ద బ్లూ లీడర్స్ హై-లెవల్ ఈవెంట్ ఆన్ బయోడైవర్సిటీ బియాండ్ నేషనల్ జూరిస్‌డిక్షన్' సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీబీఎన్‌జే ఒప్పందాన్ని 2025లో జరగనున్న 'ద యునైటెడ్ నేషన్స్ ఓషన్ కాన్ఫరెన్స్' వేదికగా అమలులోకి తేవడానికి కృషిచేయాలని పిలుపునిచ్చింది.

బీబీఎన్‌జే ద్వారా ఆశిస్తున్న రంగాల వారీ ప్రయోజనాలు

1. ఆర్థిక ప్రయోజనాలు: దేశ తీరప్రాంతాల్లో మత్స్య సంపద వృద్ధి, సముద్ర ఆధారిత ఉద్యోగ, ఆదాయ కల్పన పెంపు, నిజమైన సుస్థిర నీలి ఆర్థికవ్యవస్థ సాధన.
2. సామాజిక ప్రయోజనాలు: భావితరాల సంక్షేమాన్ని పెంపొందించడం, అంతర్జాతీయ సముద్ర సమానత్వ సూత్రాలను ఆచరణలోకి తేవడం, సముద్ర వనరుల నుంచి అత్యధిక ప్రయోజనాలు పొందేవిధంగా అధ్యయన, నిర్వహణపరమైన కౌశలాల పెంపు.
3. దౌత్యపర ప్రయోజనాలు: దేశాల మధ్య బహుపాక్షిక సహకారం, పరిపాలనాపరమైన సహాయ సహకారాలను బలపర్చడం, అంతర్జాతీయ నిర్ణయాధికారాల పెంపొందింపు, సముద్ర వాతావరణ పునరుద్ధరణ.

బీబీఎన్‌జే ఒప్పందానికి ఎదురవుతున్న సమస్యలు

1. 30 శాతం ప్రపంచ సముద్ర ప్రాంతాన్ని 2030 వరకు పరిరక్షించాలన్న ధ్యేయం ప్రాతిపదికగా ఏర్పడిన ఈ ఒప్పందం అమలుకు నోచుకోవాలంటే కనీసం 60 దేశాలు ర్యాటిఫై చేయాల్సి ఉంది. కానీ ఇంతవరకూ రెండు దేశాలే ర్యాటిఫై చేశాయి. వచ్చే ఏడాది సెప్టెంబరు 20 నాటికల్లా మిగతా 58 దేశాలు ర్యాటిఫై చేయడం సందేహాస్పదమే. ఒకవేళ ర్యాటిఫై చేసినప్పటికీ మరో అయిదేళ్లలో 30 శాతం సముద్ర ప్రాంతాన్ని పరిరక్షించడానికి యుద్ధప్రాతిపదిక చర్యలు అవసరం. ఇంకా నిధుల వితరణ, వ్యవస్థల నిర్మాణం, చట్టం అమలు వ్యవస్థల పరంగా ఒక కొలిక్కిరాని నిర్ణయాలు ఏమేరకు లక్ష్యసాధనకు దారిచూపగలవన్నది సందేహాస్పదం.
2. పర్యావరణ ప్రభావ అంచనాలు హైసీస్ ప్రాంతాల్లో చేయడం సాంకేతికంగా చాలా క్లిష్టమైన అంశం. పలు టెక్నిక్స్ పరంగా కూడా ఇంకా శాస్త్రీయ, సాంకేతిక అధ్యయనాలు జరగాల్సి ఉంది. ఈ అధ్యయనాలకు భారీస్థాయిలో నిధుల కేటాయింపు కూడా అవసరం.
3. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సముద్ర జీవవనరుల పంపిణీని ఏవిధంగా చేయాలనే అంశం అత్యంత క్లిష్టమైనది, చాకచక్యంగా నిర్వహించాల్సిన అంశం.

ఇన్ని సవాళ్లు ఉన్న నేపథ్యంలో, మరో ఏడాదిన్నర కాలంలో బీబీఎన్‌జే ఒప్పందం పట్టాలెక్కడం కష్టసాధ్యమైనప్పటికీ, సుతారమూ సాధించి తీరాల్సిన ఆవశ్యకత ప్రపంచ తీర దేశాలకు ఉంది. ఎందుకంటే, వాతావరణ మార్పుల వల్ల తలెత్తే విపత్తులను ఎక్కువగా ఎదుర్కొనేవి ఆ దేశాలే కాబట్టి. తమ తీర ప్రాంతాలు మునిగిపోకూడదన్నా, తుపానులు రాకుండా ఉండాలన్నా, మత్స్యసంపద తరిగిపోకూడదన్నా భూమిపై అత్యధిక విస్తీర్ణంలో కార్బన్ సింక్ రూపంలో ఆవరించి ఉన్న సముద్ర పర్యావరణాన్ని పరిరక్షించుకోకతప్పదు. దీనికి బీబీఎన్‌జే ఒప్పందం ఒక చక్కని చుక్కానిగా ఉపయోగపడుతుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

బీబీఎన్‌జే ఒప్పందం-లక్ష్యాలు

1. మొత్తం సముద్ర భాగంలో మూడింట రెండువంతులుగా ఉన్న హైసీస్ ప్రాంతాన్ని, ప్రస్తుతం ఉన్న అత్యల్ప రక్షితస్థాయి(1.44 శాతం) నుంచి మరింత ఎక్కువ రక్షిత స్థాయికి పెంచడం. తద్వారా సముద్ర ఆవరణ వ్యవస్థను పరిరక్షించడం.
2. హైసీస్ ప్రాంతంలో ఉన్న మెరైన్ జెనెటిక్ రిసోర్సెస్(సముద్రాంతర్గత జీవ వనరులు - సముద్రపు జీవులు, నాచు, మొక్కలు మొదలైన వాటిని) అన్ని దేశాల మధ్య న్యాయబద్ధంగా, సమంగా పంపిణీ చేసి అన్ని దేశాలకు సమానంగా ఆర్థిక లబ్ధి చేకూర్చడం.
3. సముద్రాంతర్గత ఖనిజోద్ధహణం(డీప్ సీ మైనింగ్) వంటి సముద్ర ఆవరణ వ్యవస్థలకు హాని కలిగించే మానవ చర్యలకు అనుమతించే ముందు వివిధ దేశాలు పర్యావరణ ప్రభావాలను సమర్థవంతంగా అంచనా వేసే మార్గదర్శకాలను రూపొందించడం.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

ఐఐఎఫ్‌టీ
ఆన్‌లైన్‌లో ఎంబీఏ(ఐబీ)



న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ) - ఎంబీఏ(ఇంటర్నేషనల్ బిజినెస్) ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి ఆన్‌లైన్ విధానంలో ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు: ఈ ప్రోగ్రామ్‌ను వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఉద్దేశించారు. దీని వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి ఏడాది మేనేజ్‌మెంట్ స్ట్రాటజీ, ట్రేడ్ అండ్ ఫైనాన్స్, మార్కెటింగ్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్సెస్ కోర్సులు చదవాల్సి ఉంటుంది. రెండో ఏడాది ఫైనాన్స్, ట్రేడ్, మార్కెటింగ్, స్ట్రాటజీ, హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎకనామిక్స్ స్పెషలైజేషన్‌లలో ఒకదాన్ని ఎంచుకోవాలి. ప్రోగ్రామ్‌లో భాగంగా వర్చువల్ సెషన్స్ ఉంటాయి. పారిశ్రామిక నిపుణులు గెస్ట్ లెక్చర్స్ ఇస్తారు. కేస్ స్టడీస్, ప్రాబ్లం సాల్వింగ్ విధానాలపై బృంద చర్చలు ఉంటాయి. వారాంతాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఆన్‌లైన్ సెషన్స్ నిర్వహిస్తారు.

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు. కనీసం ఏడాది ప్రొఫెషనల్ అనుభవం తప్పనిసరి. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **వెబ్‌సైట్:** www.iift.ac.in

ఐహెచ్‌ఎంలో డిప్లొమా

హాజీపూర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఐహెచ్‌ఎం)- డిప్లొమా ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అకడమిక్ మెరిట్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు వైవా, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాదిన్నర. దేశవ్యాప్తంగా ఉన్న స్టార్ హోటళ్లలో ఏడాది పాటు ఇంటెన్సివ్ ట్రెయినింగ్, ఆర్నెల్లపాటు ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఉంటాయి.

విభాగాలు-సీట్లు: ఫుడ్ ప్రొడక్షన్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ విభాగాలు ఉన్నాయి. ఒక్కోదానిలో 56 సీట్లు ఉన్నాయి. ప్రతి విభాగంలో జనరల్ అభ్యర్థులకు 26, ఓబీసీలకు 15, ఎస్సీలకు 8, ఎస్టీలకు 4, ఈడబ్ల్యూఎస్ వర్గానికి 3 సీట్లు ప్రత్యేకించారు.


అర్హత: గుర్తింపు పొందిన బోర్డు(స్టేట్/సెంట్రల్) నుంచి ఏదేని గ్రూపుతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

వెబ్‌సైట్: ihmhajipur.net

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/PRJDZZDలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి






క్యూలో నిల్చుని ఓటేసిన సినీ ప్రముఖులు

సోమవారం హైదరాబాద్‌లో లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో సినీ ప్రముఖులు తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. సాధారణ జనంతో పాటు ఉదయం ఏడు గంటలకే పోలింగ్ బూత్‌కు వెళ్లి క్యూ లైన్లలో నిలబడి, ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు. మెగాస్టార్ చిరంజీవి, మోహన్‌బాబు, జూనియర్ ఎన్టీఆర్, మహేశ్ బాబు, అల్లు అర్జున్, రామ్‌చరణ్, కల్యాణ్‌రామ్, డాక్టర్ రాజశేఖర్, నాని, నాగచైతన్య, విజయ్ దేవరకొండ.. ఒకరనేమిటి అందరూ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 'మీరు కూడా ఓటు వేయండ'ంటూ పిలుపునిచ్చారు.







మాతృభాషలోనూ డబ్బింగ్

దక్షిణాది అభిమానులే కాక ఉత్తరాది ప్రేక్షకలోకం కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా 'కల్కి 2898 ఏ.డీ'. ఇందులో ప్రభాస్‌కు జోడీగా దీపికా పదుకొనే కథానాయికగా నటిస్తున్న సంగతి తెలిసిందే. జూన్ 27న ఈ చిత్రం విడుదల కానుండడంతో చిత్ర బృందం పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగవంతం చేసింది. ఇటీవలే ఈ మూవీలో తన పాత్ర కోసం దీపికా డబ్బింగ్ మొదలుపెట్టారు. ఆ పాత్ర డబ్బింగ్‌ను హిందీలోనే కాకుండా తన మాతృభాష అయిన కన్నడలోనూ దీపికానే స్వయంగా చెప్పుకోవడం విశేషం. తన మాతృభాషలో డబ్బింగ్‌కు దీపికానే వాయిస్ అందించడంతో ఇది మూవీకి మరింత ప్లస్ కానుంది అని సినీ వర్గాలు భావిస్తున్నాయి. కాగా, ఈ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌కు నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దిశా పటానీలతో కూడిన భారీ తారాగణం ఇందులో నటిస్తున్నారు. అశ్వినీదత్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.





కేన్స్ చిత్రోత్సవంలో టీజర్ లాంచ్

మంచు విష్ణు నటిస్తున్న ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ 'కన్నప్ప'. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు తారస్థాయిలో ఉన్నాయి. ఇందుకు తగ్గట్లే ఈ సినిమాకు సంబంధించిన ప్రతీ విషయంలో చిత్ర బృందం పలు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ సినిమా టీజర్‌ను ఈ నెల 20న ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో విడుదల చేయబోతున్నారు. 'వరల్డ్ ఆఫ్ కన్నప్ప' పేరుతో రిలీజ్ కానున్న ఈ టీజర్ ప్రేక్షకులకు అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని అందిస్తుందని చిత్ర బృందం ధీమాగా ఉంది. కాగా, ఈ భారీ బడ్జెట్ ఫ్యాంటసీ డ్రామాను ముఖేశ్ కుమార్ సింగ్ తెరకెక్కిస్తున్నారు. మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ప్రభాస్, మోహన్‌బాబు, శరత్‌కుమార్, శివ రాజ్‌కుమార్, అక్షయ్‌కుమార్, మోహన్ లాల్, ప్రభుదేవా వంటి స్టార్స్ కీలక పాత్రల్లో మెరవనున్నారు.

నటిస్తూ వేదికపై కుప్పకూలిన నటుడు



జీవితంలో చివరి క్షణం వరకూ నటిస్తూ ఉండాలని చాలా మంది చెబుతుంటారు. అది మరాఠి నటుడు సతీశ్ జోషి విషయంలో నిజమైంది. ఆదివారం ఆయన ముంబైలో రంగోత్సవ్ కార్యక్రమంలో ప్రదర్శన ఇస్తూ ఉన్నట్లుండి వేదికపై కుప్పకూలారు. 'ఉదయం నుంచి సతీశ్ అలసటతో కనిపించారు. వేదికపై కార్యక్రమం ప్రారంభమైన కొద్ది సేపటికే ఆయన కింద పడిపోయారు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది.' అని సతీశ్ సన్నిహిత మిత్రుడు, సహ నటుడు రాజేశ్ దేశ్‌పాండే చెప్పారు. మరాఠి నాటకాలు, టీవీ సీరియల్స్, సినిమాల ద్వారా సతీశ్ చిరపరిచితుడు. ఆయన మరణంతో ఓ ప్రతిభాశాలిని మరాఠి చిత్ర పరిశ్రమ కోల్పోయిందని చెప్పాలి.

పోలింగ్ రోజున వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. రాళ్లు, కర్రలు, పెట్రోలు బాంబులతో తెగబడ్డాయి. పల్నాడు వ్యాప్తంగా భయాందోళనలు సృష్టించాయి. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల కార్లను ధ్వంసం చేశాయి. కొన్ని వాహనాలకు నిప్పు పెట్టాయి. వైసీపీ దుశ్చర్యల్లో పదుల సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. తెనాలిలో స్థానిక ఎమ్మెల్యే ఏకంగా ఓటరు చెంప పగలగొట్టడం.. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఓటమి భయంతోనే ఇటువంటి దాడులకు పాల్పడ్డారని టీడీపీ ఆరోపిస్తోంది.

వైసీపీ మూకల.. అరాచకం

- ఎన్నికల సందర్భంగా పల్నాడులో బరితెగింపు
- కూటమి అభ్యర్థులే లక్ష్యంగా దాడులు
- కార్లు ధ్వంసం..
- గ్రామాల్లో అల్లర్లు.. టీడీపీ శ్రేణులపై దాడులు
- బాపట్ల జిల్లాలోనూ వైసీపీ దౌర్జన్యకాండ

బ్రహ్మారెడ్డిపై దాడికి యత్నం

- రెండు కార్లు ధ్వంసం.. ఒక కారు దగ్ధం



వైసీపీ మూకలు ధ్వంసం చేసిన బ్రహ్మారెడ్డి వాహనం



దగ్ధమవుతున్న బ్రహ్మారెడ్డి స్కార్పియో కారు

రెంటచింతల, మే 13: మండలంలోని రెంటాల గ్రామంలో ఉదయం 6 గంటల 20 నిమిషాలకే టీడీపీకి చెందిన ఏజెంట్లతో సహా ఇతరులను వైసీపీ వర్గీయులు పురవీధుల్లో తన్నుకుంటూ దుర్భాషలాడారు. కర్రలు కొడవళ్లతో దాడి చేయడంతో టీడీపీకి చెందిన ఆరుగురు గాయపడ్డారు. వారిలో చే(రె)డ్డి మంజుల, చే(రె)డ్డి గోపాలరెడ్డిలకు బాగా గాయాలయ్యాయి. వీరిని గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బ్రహ్మారెడ్డి గురజాల వెళ్లి క్షతగాత్రులను పరామర్శించి రెంటాలకు వచ్చి గంట ఇరవై నిమిషాలు అక్కడే ఉన్నారు. ఆ తరువాత టీడీపీ సానుభూతిపరులను ఓటింగ్ రానీయకుండా వైసీపీ గూండాలు కర్రలతో హల్‌చల్ చేశారు. బ్రహ్మారెడ్డి 11.40గంటలకు గ్రామంలోకి మళ్లీ వచ్చారు. 239, 240, 241, 242 పోలింగ్ బూత్‌ల దగ్గరకు వచ్చి విజయవాడ ఎస్పీ సుప్రజకు జరిగిన పరిణామాలను వివరిస్తున్న సమయంలో మహిళలు బ్రహ్మారెడ్డిని ఏకవచనంతో సంబోధించడంతో పాటు కారం చల్లారు. బ్రహ్మారెడ్డి వంగడతో ఆ కారమంతా భుజాల మీద పడింది. వెనుక ఉన్న పాత్రికేయుల కళ్లు కారంతో నిండిపోయాయి. మహిళలంటే గౌరవం లేదా.. ఇదేమి సంస్కృతి.. కనీసం మమ్ములను వెళ్లనీయకుండా అడ్డుకుంటారేంటని విజయవాడ ఎస్పీ సుప్రజ ఆగ్రహంతో ప్రశ్నించారు. కొద్ది నిమిషాల వ్యవధిలో పార్కింగ్ చేసిన వాహనాలను ధ్వంసం చేశారు. ఒక స్కార్పియో వాహనాన్ని దొర్లించారు. బోర్లా పడేసిన వాహనానికి వైసీపీ మూకలు నిప్పు పెట్టారు. ఇక్కడ జరుగుతున్న సంఘటనలను జిల్లా ఎస్పీ బిందూ మాధవ్‌కు తెలిపారు. అలాగే ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి కూడా రెంటాలకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

బ్రహ్మారెడ్డిపై దాడికి యత్నం

గ్రామంలోకి వచ్చిన బ్రహ్మారెడ్డిపై దాడికి యత్నించారు. కొంత మంది యువకులు కర్రలతో హల్‌చల్ చేశారు. అసలు బ్రహ్మారెడ్డిని ఊళ్లోకి రానీయకుండా చూడాలనేది వైసీపీ వ్యూహం. కానీ రెండు సార్లు రావడంతో వారు జీర్ణించుకోలేకపోయారు. ఊరి చివరన కర్రలతో దాడులు చేయడానికి ఉపక్రమించగా పోలీసులు తరిమికొట్టారు.





ఎమ్మెల్యే సోదరుడు, అతని గ్యాంగు చేసిన దాడిలో గాయపడిన టీడీపీ నేతలు

బీభత్సం సృష్టించిన ఎమ్మెల్యే సోదరుడు

- 50 బైకులు, 10 కార్లతో పట్టణంలో హల్‌చల్

మాచర్లటౌన్, మే 13: స్థానిక ఎమ్మెల్యే, వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు వెంకట్రామిరెడ్డి పోలింగ్ రోజున పట్టణంలో బీభత్సం సృష్టించారు. పీడబ్ల్యూడీ కాలనీలోని పోలింగ్ బూత్‌లో అధికసంఖ్యలో ఓట్లు పోలవడం, ఇవి టీడీపీ సానుభూతిపరులవి కావడంతో ఆగ్రహించిన వెంకట్రామిరెడ్డి తన గ్యాంగ్‌తో సుమారు 50 బైకులు, 10 కార్లతో అక్కడకు చేరుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ఉన్న టీడీపీ నేతల వాహనాలపై కార్లను ఎక్కించారు. అంతటితో ఆగక టీడీపీ నేతలను ఢీకొట్టి తొక్కించుకుంటూ వెళ్లారు. ఈ ఘటనలో ఆదూరి అలైఖ్య, ఫిరోజ్, షాజిద్, మల్లెల గోపి (డీజే)లకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే టీడీపీ నేత యెనుముల కేశవరెడ్డి ఇంటిపై దాడి చేశారు. ఇల్లు, కారును ధ్వంసం చేశారు. ఇంట్లోని ఫర్నీచర్, సామాన్లు ఇంటి నుంచి బయటకు లాగి ధ్వంసం చేశారు. సుమారు 50 మంది టీడీపీ నేతల గృహాల్లోకి దూరి బీభత్సం సృష్టించారు. గంటపాటు ఆ ప్రాంతమంతా అలజడి సృష్టించారు.

రెచ్చిపోయిన వైసీపీ మూకలు



వెల్దుర్తి మండలం గొట్టిపాళ్లలో దగ్ధమవుతున్న జనసేన నేత వాహనం

వెల్దుర్తి, మే 13: మండలంలో సోమవారం పోలింగ్ సందర్భంగా వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. అలజడులు సృష్టించారు. టీడీపీ శ్రేణులు దీటుగా ఎదుర్కొన్నారు. లోయపల్లిలో పోలింగ్ ప్రారంభమైన గంటలోనే టీడీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు. టీడీపీకి చెందిన ముగ్గురికి గాయాలయ్యాయి. గొట్టిపాళ్లలో టీడీపీ నేతల గృహాలపై రాళ్లు, సీసా బాటిళ్లు విసిరి భయభ్రాంతులకు గురి చేశారు. టీడీపీ కార్యకర్త రాజబోయిన శ్రీహరికి గాయాలయ్యాయి. జనసేన కార్యకర్త మాదాసు నాగరాజుకు చెందిన బొలేరోకు వైసీపీ మూకలు నిప్పంటించి దగ్ధం చేశాయి. కొత్తపుల్లారెడ్డిగూడెంలోని 118వ బూత్‌లో టీడీపీ ఏజెంట్లు రేఖానాయక్, హనుమంతునాయక్‌లపై దాడి చేశారు. రేఖానాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అడ్డుకున్న హెడ్ కానిస్టేబుల్ వెంకయ్యకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. ఇదే గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి పోలింగ్ సరళిని పరిశీలించేందుకు బూత్‌లోకి వెళ్లగా వైసీపీ మూకలు అతనిపై దాడి చేసి గాయపరిచారు. ఆయన కారును కూడా ధ్వంసం చేశారు. పట్లవీడులో దొంగ ఓట్లు వేస్తున్న వైసీపీ కార్యకర్తను టీడీపీ నేతలు గుర్తించి ప్రశ్నించారు. మీరెవరు ప్రశ్నించడానికి అంటూ వైసీపీ నేతలు దాడులకు దిగారు. మరసపెంటకు చెందిన టీడీపీ నేత రెడ్యానాయక్ కారుపై వైసీపీ నేతలు రాళ్ల దాడి చేసి ధ్వంసం చేశారు. ఇదే గ్రామంలో పోలింగ్ విధులు నిర్వహిస్తున్న పుల్లారెడ్డి వాహనాన్ని వైసీపీ నేతలు ధ్వంసం చేశారు. కండ్లకుంటలోని 120 బూత్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయంకు కారణమైన లైన్‌మ్యాన్‌ను రామాంజినేయులును విధుల నుంచి తొలగించాలని జిల్లా ఎన్నికల అధికారి లోతేటి శివశంకర్ ఆదేశించారు.



తంగెడలో వైసీపీ నేతలు విసిరిన పెట్రోలు బాంబులకు మండుతున్న మంటలు



వైసీపీ మూకల దాడిలో గాయపడిన సురేష్, శ్రీనులను పరామర్శిస్తున్న ఉమ్మడి అభ్యర్థి యరపతినేని

వైసీపీ నేతల దుశ్చర్య

- జానపాడు, కరాలపాడులో వైసీపీ నేతల వీరంగం

పిడుగురాళ్ల, మే 13: మండలంలోని జానపాడులో టీడీపీ కార్యకర్తలైన వున్నం సురేష్, వున్నం శ్రీనులపై వైసీపీ శ్రేణులు దాడులకు పాల్పడటంతో తలకు గాయాలవగా పిడుగురాళ్ల ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. వీరిని ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు పరామర్శించి ధైర్యం చెప్పారు. అదేవిధంగా కరాలపాడు గ్రామంలోనూ పోలింగ్ ముగిసే సమయంలో వైసీపీ నేతలు కర్రలతో బీభత్సం సృష్టించి క్యూ లైన్‌లో వున్న ఓటర్లను భయాందోళనకు గురిచేశారు. టీడీపీ కార్యకర్తలపై విచక్షణా రహితంగా ఎగబడ్డారు. అడ్డొచ్చిన పోలీసుపై కూడా చేయి చేసుకున్నట్లు సమాచారం. తంగెడ గ్రామంలో వైసీపీ నేతలు పెట్రోలు బాంబులతో, రాళ్లతో వీరంగం సృష్టించారు. పెట్రోలు బాంబులు విసురుతూ గ్రామస్తులను, టీడీపీ శ్రేణులను భయాందోళనకు గురిచేశారు.

అనగానిపై దాడికి యత్నం

రేపల్లె, మే 13: రేపల్లె పట్టణంలోని ఓపెన్ థియేటర్‌లో ఉదయం నుంచే వైసీపీ నాయకులు బూత్‌లో హల్‌చల్ చేశారు. టీడీపీ బూత్ ఏజెంట్లపై దాడికి యత్నించారు. సాయంత్రం 4గంటల సమయంలో పట్టణంలోని బూత్‌లలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఓపెన్ థియేటర్ బూత్‌లోకి పరిశీలించేందుకు వెళ్లారు. వైసీపీ మూకలు ఎమ్మెల్యే అనగానిపై ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడి 20 రోజుల్లో తల తీసుకుని వెళ్తానంటూ మీదకు వచ్చారు. వైసీపీ నాయకుడ్ని ఒక దెబ్బ వెయ్యగా పక్కన ఉన్న టీడీపీ, వైసీపీ నాయకులు తోపులాట జరిగింది. సమీపంలో ఉన్న పోలీసులు ఇరువురికి సర్దిచెప్పి పంపారు. వైసీపీ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఫిర్యాదు చేశారు.

టీడీపీ శ్రేణులపై వైసీపీ దాడులు..



వైసీపీ దాడిలో గాయ పడ్డ జనసేన నేత రాడ్ల శ్రీను, తొండపికి చెందిన టీడీపీ కార్యకర్త

సత్తెనపల్లి, మే13: ముప్పాళ్ళ మండలం తొండపి గ్రామంలో ఓటు వేసేందుకు వెళ్ళిన టీడీపీ కార్యకర్తలు బిగ్గినేని చిన వెంకట్రామయ్య, రాయిడి రామారావు, రాయిడి బాపయ్య, షేక్ ఖాజావలి, నల్లబోతు శ్రీను, చల్లా పిచ్చయ్యలపై వైసీపీ కార్యకర్తలు రాళ్ళు కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. వారిని చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. రాజుపాలెం మండలం బలిజేపల్లిలో ఓటు వేసేందుకు వెళ్తున్న టీడీపీ నేత పల్లపాటి రాములుపై వైసీపీ కార్యకర్తలు దాడి చేశారు. తలకు గాయం కావటంతో అతనిని వైద్యశాలకు తరలించారు. సత్తెనపల్లి మండలంలోని ఫణిదంలోని రామచంద్రాపురం పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు వెళ్ళిన టీడీపీ కార్యకర్తలు కోరంపల్లి సునీత, వడ్డెరపు లీలావతిపై వైసీపీ కార్యకర్తలు దాడి చేసి గాయపరిచారు. ముప్పాళ్ళ మండలం గోళ్ళపాడులో పాగోలు బాజీ అనే ఓటరుపై ఎస్ఐ లాఠీతో దాడి చేయటంతో అతని కాలి వెముక విరిగింది. సత్తెనపల్లి పట్టణం 23వ వార్డుకు చెందిన జనసేన నేత వల్లె శ్రీనివాసరావు, జనసేన కార్యకర్త చౌదరి అనిఇల్ పై కూడా వారి ఇంటి వద్దనే రాడ్లతో తలపై తీవ్రంగా దాడి చేశారు. ముప్పాళ్ళ మండలం మాదలలో కూడా పోలింగ్ కేంద్రం టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకులు దాడి చేశారు.

అంబటి అల్లుడిపై తిరుగుబాటు

సత్తెనపల్లి, మే 13: మంత్రి అంబటి రాంబాబు అల్లుడు ఉమేష్ చౌదరి ముప్పాళ్ళ మండలం నార్నెపాడు గ్రామంలో సోమవారం హల్‌చల్ చేశారు. గ్రామానికి వెళ్ళి పోలింగ్ బూత్ వద్ద ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులను, కార్యకర్తలను నా కొ..., ఎవ్రా మీరు, ఇక్కడ మీ పోజులు ఏంటని? దౌర్జన్యం చేయబోయారు. ఉమేష్ కారులో నుంచి కర్రలు, రాడ్లను వైసీపీ నాయకులు బయటకు తీసి టీడీపీ కార్యకర్తలపై దాడి చేసేందుకు ప్రయత్నించగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తిరగబడ్డారు. మంత్రి అంబటి అల్లుడిని గ్రామంలో నుంచి తరిమి వేశారు.

లావు శ్రీకృష్ణదేవరాయలుపై వైసీపీ మూకల దాడి

దొండపాడు(నరసరావుపేట రూరల్), మే 13: పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం దొండపాడు గ్రామంలో ఉమ్మడి అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు పోలింగ్‌బూత్‌ను పరిశీలించేందుకు వెళ్ళడంతో గ్రామానికి చెందిన వైసీపీ మూకలు లావు శ్రీకృష్ణదేవరాయలుపై దాడికి పాల్పడ్డారు. లావు శ్రీకృష్ణ దేవరాయలుకు చెందిన మూడు కార్లను రాళ్ళు కర్రలతో దాడి చేసి వాహనాలను ధ్వంసం చేశారు.



దొండపాడులో టీడీపీ ఉమ్మడి అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలుపై వైసీపీ గూండాల దాడిలో దెబ్బతిన్న కార్లు

అట్టుడికిన నరసరావుపేట

- రబ్బరు తుటాలు ప్రయోగించిన పోలీసులు
- పట్టణంలో తీవ్ర ఉద్రిక్తత
- ఇరువర్గాల కార్లు ధ్వంసం
- ఎంపీ లావు కాన్వాయ్‌లోని కారును దహనం చేసిన వైసీపీ మూకలు



వైసీపీ మూకలు దహనం చేస్తున్న ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు కాన్వాయ్‌లోని కారు

నరసరావుపేట, మే13: నరసరావుపేట పట్టణంలో వైసీపీ మూకలు దాడికి తెగబడ్డాయి. టీడీపీ అభ్యర్థి అరవింద బాబుతో పాటు పలువురు నేతల కార్లను ధ్వంసం చేశాయి. ఈ దాడులకు ప్రతిగా టీడీపీ శ్రేణులు కూడా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ఇంటి వద్ద ఉన్న కార్లను ధ్వంసం చేశాయి. ఇరువర్గాల దాడుల పరంపరతో పట్టణంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితి అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు రబ్బరు తుటాలను ప్రయోగించారు. ఇరువర్గాలు నేతల కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున మోహరించాయి. వైసీపీ కార్యకర్తలు టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు కాన్వాయ్‌లోని ఒక కారును దహనం చేశాయి.

పట్టణంలో సాయంత్రం మూడు గంటల సమయంలో మున్సిపల్ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో దొంగ ఓటు వేస్తున్న వారిని టీడీపీ అభ్యర్థి ఏజెంట్లు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఇరువర్గాలకు స్వల్ప ఘర్షణ జరిగింది. దీంతో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి తన అనుచరులతో స్కూల్ వద్దకు వచ్చాడు. అటుగా వస్తున్న టీడీపీ అభ్యర్థి అరవిందబాబు కారుపై గోపిరెడ్డి అనుచరుడు రాయితో కారును ధ్వంసం చేశాడు. ఈ కాన్వాయ్‌లోని పలు కార్లను కూడా గోపిరెడ్డి అనుచరులు ధ్వంసం చేశారు. అరవిందబాబుపై దాడికి ప్రతి దాడికి టీడీపీ శ్రేణులు పాల్పడ్డాయి. గోపిరెడ్డి ఆస్పత్రి వద్ద ఉన్న కార్లను ధ్వసం చేశాయి. ఆస్పత్రి కిటికీ అద్దాలను రాళ్ల రువ్వి పగలు గొట్టాయి. దాడి సమాచారం తెలుసుకున్న గోపిరెడ్డి తన అనుచరులతో తన ఆస్పత్రి వద్దకు వచ్చారు. ఈ దాడికి ప్రతిగా టీడీపీ కార్యాలయంపై దాడికి పూనుకున్నారు. గుంటూరు రోడ్డులో రాళ్ల వర్షం కురిపించుకున్నారు. వీరిని చెదరగొట్టేందుకు పోలీసులు తొలుత లాఠీ చార్జ్ చేశారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో రబ్బరు తుటాలను ప్రయోగించి పరిస్థితిని అదుపు చేశారు. అటు అరవిందబాబు, ఇటు గోపిరెడ్డి ఆస్పత్రి వద్ద ఇరువర్గాలు రాత్రి 9 గంటల వరకు మోహరించే ఉన్నాయి. ఈ సందర్భంలో చిలకలూరిపేట నుంచి ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ కాన్వాయ్ ఆ ప్రాంతం గుండా వస్తోంది. కాన్వాయ్‌లో చివరి కారును వైసీపీ కార్యకర్తలు అడ్డుకొని కారుపై దాడి చేశారు. కారులో వారు కిందకు దింపి కారుపై ఇంధనం పోసి తగులబెట్టారు. రెండు వైపులా పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. అరవిందబాబు, గోపిరెడ్డిలను హౌస్ అరెస్టు చేశారు. పట్టణంలో పరిస్థితులు పోలీసుల అదుపులోకి రాలేదు. పట్టణంలో దాడులు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకొవడంలో పోలీసుల విఫలమయ్యారన్న విమర్శలు వ్యక్తమయ్యాయి.

ఓటరుపై దాడి హేయం

- దాడిని ఖండించిన పెమ్మసాని, నాదెండ్ల, ఆలపాటి
- గుంటూరు ఆసుపత్రిలో పరామర్శించిన పెమ్మసాని, రాజకుమారి

తెనాలి, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఓటరుపై చేయిచేసుకుని చెంపపై కొడితే, అంతే వేగంగా ఓటర్ కూడా ఎమ్మెల్యే చెంప చెళ్లుమనిపించాడు. ఇంతలోనే ఎమ్మెల్యే శివకుమార్ అనుచరులు మూకుమ్మడిగా అతనిపైపడి విచక్షణా రహితంగా దాడిచేశారు. తెనాలి అసెంబ్లీ నియోజకవర్గంలోని ఐతానగర్ ఎర్రబడిలో సోమవారం జరిగిన ఈ ఘటనలో బాధితుడు సుధాకర్ గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఆయనను టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, తెనాలి ఎమ్మెల్యే నియోజకవర్గ కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్, మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, తదితరులు పరామర్శించారు. అతని మేమంతా అండగ ఉంటామని ధైర్యం చెప్పారు.



గుంటూరు జిల్లా సమగ్ర వైద్యశాలలో సుధాకర్‌ను దాడి జరిగిన వివరాలు అడిగి తెలుసుకుంటున్న పెమ్మసాని

ఘటన గురించి బాధితుడు, ఓటరు సుధాకర్ ఇలా వివరించారు.. బాధ్యతగా ఉండాల్సిన ఎమ్మెల్యే తాను చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు నేను మద్యం మత్తులో ఉన్నానని, అసభ్యంగా మట్లాడానని, ఎవరినో కులం పేరుతో దూషించానని, నిందలు వేయటం సరికాదు. మద్యం సేవించానని నిరూపిస్తే ఏ శిక్షకైనా నేను సిద్దమే. ప్రస్తుతం ఆసుపత్రిలోనే ఉన్నాను కనుక నా రక్తం తీసుకుని పరీక్షించుకోవాలని, మద్యం సేవించినట్టు నిర్ధారణ అయితే నాకేసు వెనక్కు తీసుకుని, నాపై చర్యలు తీసుకోవాలని నేనే కోరతానన్నారు.

పోలింగ్ శాతం తగ్గించే కుట్ర...

ఓటర్లపై ఎమ్మెల్యే స్థాయి వ్యక్తే చేయిచేసుకోవటం, వారి అనుచరులు దాడులు చేయటం ప్రజాస్వామ్యంలో మంచిదికాదని గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. చెంప దెబ్బతో మీరు ఓటరును బెదిరించాలని చూస్తే, మీకు అంతే వేగంగా దాని పర్యవసానం కనిపిస్తుంది. భయపెట్టి పోలింగ్ జరగకుండా చూద్దామనే ప్రయత్నాలను అధికార పార్టీ మానుకోవాలని అన్నారు.

మీ ప్రవర్తన చూసి జనమే మీ చెంపపై తిప్పికొట్టారు..

ప్రజాస్వామ్యంలో ఓటరే దేవుడు. అటువంటి దేవుడిని జాగ్రత్తగా చూసుకోవలసిందిపోయి దాడిచేస్తారా? ఐతానగర్‌లో సుధాకర్‌పై జరిగిన దాడిని జనసేన, టీడీపీ, బీజేపీ తరపున ఖండిస్తున్నాం. అని తెనాలి అసెంబ్లీ కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. సుధాకర్‌పై దాడిచేసిన వారంతా అటువంటి చరిత్ర ఉన్నవారని తెలిసి పోలింగ్ స్టేషన్ లోపలకు పోలీసులు ఎట్లా అనుమతిస్తారంటూ మండిపడ్డారు. ఈ వ్యవహారంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఓటర్‌ని కొడితే ఓట్లు పడతాయా..?

ఇంకెంత కాలం దాడులు చేస్తారు? ఇంకెంతకాలం పాలన సాగుతుందనుకుంటున్నారంటూ మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రశ్నించారు. సుధాకర్‌పై దాడిని ఖండించారు. ఓటర్‌ను కొడితే ఓట్లు ఎట్లాపడతాయనుకుంటున్నారో నాకు అర్ధం కావటంలేదని, ఎంతో అనుభవం ఉందని చెప్పే అధికార పార్టీ నేతలు ఆ చిన్న లాజిక్ ఎన్నికల వేళ ఎట్లా మర్చిపోయారో అర్ధం కావటం లేదన్నారు. ప్రజల తీర్పు వారి విముక్తిని కోరుకుంటోందని ఆయన అన్నారు.

వైసీపీ దౌర్జన్య కాండ



నిబంధనలకు విరుద్ధంగా పేరలి పోలింగ్‌బూత్‌లోకి అనుచరులతో కలిసి వెళ్లిన కోన వెంకట్

బాపట్ల, మే 13(ఆంధ్రజ్యోతి): బాపట్ల నియోజకవర్గంలో ఎన్నికల సందర్భంగా ఘర్షణలు చోటు చేసుకున్నాయి. చీరాల మండలం గవినివారిపాలెంలో వైసీపీ శ్రేణుల దాడిలో టీడీపీ కార్యకర్తకు గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ అభ్యర్థి ఎంఎం కొండయ్య గ్రామానికి చేరుకుని పోలీసుతో మాట్లాడుతున్న సమయంలో ఒక్కసారిగా వైసీపీ రౌడీ మూకలు ఆయనపైకి దూసుకొచ్చారు. ఈ క్రమంలో ఆయన కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. కర్రలు, రాడ్లు పెట్టుకుని వైసీపీ శ్రేణులు అరాచకం సృష్టించి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారు.

కోన వెంకట్ అనుచరులను వెంటేసుకుని...

కర్లపాలెం మండలం లోని పోలింగ్ బూత్‌ల వద్ద కోన వెంకట్ తన అనుచరులను వెంటేసుకుని హంగామా సృష్టించారు. ప్రశ్నించిన టీడీపీ శ్రేణులపై దాడికి వైసీపీ మూకలు తెగబడ్డాయి. దళితులపై దాడి చేసి మళ్లీ ఎందుకు వచ్చావని కర్లపాలెం మండలంలోని పేరలి బూత్ వద్ద దళిత యువకులు ప్రశ్నించారు. వెంటనే వైసీపీ మూకలు దాడి చేయడంతో దళితులైన ప్రేమచంద్, పవన్‌లకు గాయాలయ్యాయి.

ఏట్రావారిపాలెంలో..

కర్లపాలెం మండలం ఏట్రావారిపాలెం బూత్‌లో ఓటింగ్ సరళిని పరిశీలించడానికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధన్‌రెడ్డిపై వైసీపీ శ్రేణులు దాడి చేయబోయాయి. పెద్దఎత్తున టీడీపీ కార్యకర్తలు ప్రతిఘటించారు. పరస్పర ఘర్షణలలో వైసీపీ కార్యకర్తలు ఇద్దరికి గాయలయ్యాయి. కొల్లూరులో వైసీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు రెచ్చగొట్టే విధంగా వ్యవహరించడంతో టీడీపీ శ్రేణులు గట్టిగా స్పందించాయి. రేపల్లెలోని ఓ పోలింగ్ బూత్‌ను సందర్శించడానికి వెళ్లిన టీడీపీ అభ్యర్థి అనగాని సత్యప్రసాద్‌పై వైసీపీ కార్యకర్తలు దాడికి ప్రయత్నించారు. రాంబొట్లపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో వైసీపీ శ్రేణులు దాడి చేయడంతో టీడీపీ కార్యకర్తకు తల పగిలింది.

టీడీపీ నాయకులపై రాళ్లవర్షం



దాచేపల్లిలో వైసీపీ నేతల దాడిలో గాయపడిన కనిశెట్టి రవీంద్రను పరామర్శిస్తున్న యరపతినేని



కేశానుపల్లిలో వైసీపీ నేతల దాడిలో గాయపడిన రామకోటయ్యను పరామర్శిస్తున్న ఎంఎల్‌సీ జంగా

దాచేపల్లి, మే 13: ఎన్నికల నేపథ్యంలో సోమవారం కేశానుపల్లి గ్రామంలో వైసీపీ నేతలు టీడీపీ నాయకులైన నెల్లూరి రామకోటయ్యను దుర్భాషలాడుతూ దాడిచేసి తల పై కొట్టారు. ఈ ఘటనలో నెల్లూరి రామకోటయ్య తలకు బలంగా గాయమై తీవ్ర రక్తస్రావం జరిగింది. దీంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. సమాచారం అందడంతో ఏం జరుగుతుందో తెలుసుకుందామని ఇరికేపల్లి గ్రామానికి నడి కూడికి చెందిన టీడీపీ నాయకులు ద్విచక్ర వాహనాలలో తరలివెళ్లారు. ఇదే అదునుగా భావించి వైసీపీ నేతలు రాళ్ల వర్షం కురిపించారు. ఈ ఘటనతో టీడీపీ నేతలు ద్విచక్ర వాహనాలను అక్కడే వదిలేసి పరుగులు తీశారు.

ఇదిలావుండగా దాచేపల్లిలో దొంగఓట్లకు పాల్పడుతున్నారంటూ టీడీపీ నేతలు వాదనకు దిగడంతో వైసీపీకి చెందిన కొంతమంది వ్యక్తులు టీడీపీ కార్యకర్త కనిశెట్టి రవీంద్రను రాయితో తలపై మోదడంతో తలకు గాయమైంది. ఇదే సమయానికి కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు పాఠశాలకు చేరుకొని గాయపడిన కనిశెట్టి రవీంద్రను పరా మర్శించి ధైర్యం చెప్పారు. తంగెడ గ్రామంలో ఒక్క ఓటు విషయంలో ఏర్పడిన చిన్నవివాదం చిలికిచిలికి గాలివానగా మారి ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడం, నాటుబాంబు లు వేసుకోవడం, పెట్రోలు బాంబులతో దాడులుచేయడంతో యుద్ధ వాతావరణం ఏర్పడింది. రెండు ద్విచక్రవాహనాలు కూడా దగ్ధమైనట్లు సమాచారం. కేశానుపల్లి గ్రామానికి చెం దిన టీడీపీ నేత నెల్లూరి రామకోటయ్యపై వైసీపీ నాయకు లు దాడిచేసి గాయపరిచారని సమాచారం అందుకున్న ఎం ఎల్‌సీ జంగా కృష్ణమూర్తి అక్కడికి చేరుకొని రామకోటయ్య ను జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. నడికూడి గ్రామంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కాన్వాయ్‌పై కూడా కొంత మంది వ్యక్తులు రాళ్లు విసిరినట్లు సమాచారం. దీంతో వైసీపీ నేతలంతా నడికూడి చేరుకోవడంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం ఏర్పడిం ది. దాచేపల్లిలో వైసీపీ, టీడీపీ నేతల మధ్య తోపులాట జరిగింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	155, 164,175
చికెన్ విత్ స్కిన్	300.00
చికెన్ స్కిన్ లెస్	310.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



పోలింగ్‌కేంద్రం వద్ద కన్నా, టీడీపీ శ్రేణులపై కలపడుతున్న అంబటి, ఆయన వర్గం

మంత్రి అంబటి రిగ్గింగ్ ?

- పోలింగ్ బూత్‌లోని టీడీపీ ఏజెంట్లపై దాడులు
- తన అనుచరులతో గేటు మూయించి లోపలే ఉండి రిగ్గింగ్ ?
- అడ్డుకోబోయిన కన్నా, టీడీపీ శ్రేణులపై వైసీపీ మూకల రాళ్ల దాడి..

సత్తెనపల్లి మే 13: ముప్పాళ్ళ మండలంలోని చాగంటివారిపాలెం పోలింగ్ బూత్‌లలో మంత్రి అంబటి రాంబాబు తన అనుచరులతో దగ్గరుండి మరీ రిగ్గింగ్ చేయించారని కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఆరోపించారు. సోమవారం మంత్రి అంబటి అతని అనుచరులు పోలింగ్ కేంద్రంలోకి చొరబడి, బయట గేటు మూసివేయడంతో విషయం తెలుసుకున్న కన్నా పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకున్నారు. మంత్రి అంబటినీ, అతని అనుచరులను బయటకు తీసుకురావాలని రూరల్ సీఐ రాంబాబును కన్నా కోరినప్పటికీ పట్టించుకోక పోవడంతో కన్నా అనుచరులు బూత్ లోపలికి వెళ్ళేందుకు ప్రయత్నం చేశారు. ఈక్రమంలో ఇరు వర్గాల మధ్య తోపులాటలు జరిగాయి. దీంతో అంబటి అనుచరులు రాళ్ళు కర్రలతో దాడి చేశారు. సంఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఈ విషయంపై కన్నా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తూ దాడికి పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అనంతరం కన్నా విలేకరులతో మాట్లాడుతూ.. మంత్రి అంబటి రాంబాబు ఆయనకు ఓటమి తప్పదన్న నిర్వేదంతోనే రగ్గింగ్‌కు పాల్పడ్డారని ఆరోపించారు. అడ్డుకోబోయిన తనపై, టీడీపీ శ్రేణు లపై దాడులు దౌర్జన్యాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. చాగంటి వారిపాలెం, లంకెళ కూరపాడులో రీ పోలింగ్ జరపాలని ఎన్నికల అధికారిని కోరామన్నారు.

వైసీపీ మూక దాడిలో గాయపడినవారికి పరామర్శ

సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న ముప్పాళ్ళ మండలం తొండపి, మాదల, రాజుపాలెం మండలం బలిజేపల్లి, ముప్పాళ్ళ మండలం గోళ్ళపాడు గ్రామాలకు చెందిన టీడీపీ కార్యకర్తలను కన్నా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, టీడీపీ పల్నాడుజిల్లా టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ కొమ్మాల పాటి శ్రీధర్ పరామర్శించారు. పరామర్శించారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. కార్యకర్తలపై దాడులను వారు ఖండించారు. ఓటమి భయతోనే వైసీపీ నాయకులు ఇలాంటి అరాచకాలకు పాల్పడుతున్నారన్నారు. దాడులకు పాల్పడిన వారిపై పోలీసులు కేసులు నమోదు చేసి చట్టపరంగా శిక్షించాలని వారు హెచ్చరించారు.

తంగెడలో ఏఎస్పీ పర్యటన

- గ్రామంలో వైసీపీ దాడుల నేపథ్యంలో శాంతిభద్రతల పర్యవేక్షణ
- ఈవీఎంల తరలింపునకు ప్రత్యేక చర్యలు

దాచేపల్లి, మే 13: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం తంగెడ గ్రామంలో పోలింగ్ బూత్‌సమీపంలో బాంబులు వేసుకోవడం, కర్రలు, రాళ్లతో దాడులు చేయడంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. పోలింగ్ కేంద్రంలో పోలింగ్ మిషన్లను కూడా బయటకు తెచ్చే పరిస్థితి లేకపోయింది. దీంతో ఏఎస్పీ ప్రసన్నకుమార్ పోలీసు బలగాలతో తంగెడ గ్రామానికి చేరుకొని శాంతి భద్రతల పరిరక్షణ చర్యలు తీసుకున్నారు. ఈవీఎంలను మిషన్లను సీల్ చేసి తరలించే ఏర్పాట్లు చేశారు. గ్రామంలో వైసీపీ నేతల దాడుల్లో టీడీపీ సీనియర్ నేత చింతపల్లి హసన్ అహ్మద్‌కు చెందిన కుమారుడు మరో యువకుడికి బలమైన గాయాలు కావడంతో గుంటూరు ఆసుపత్రికి తరలించారు. ఇదిలా వుండగా భట్రుపాలెం గ్రామంలో కూడా రాత్రి 8 గంటల వరకు పోలింగ్ కొనసాగుతూనే వుంది. మధ్యాహ్న సమయంలో ఈవిఎం మిషన్లు మొరాయించాయి. దీంతో కొంత సమయం ఆలస్యం కావడంతో రాత్రి 8 గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు సమాచారం. పొందుగల గ్రామంలో 8 గంటల వరకు ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఓటు వేయడం ఆలస్యం కావడంతో ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరగడం, పగటిపూట ఎండ వేడిని తాళలేక సాయంత్రం 4 గంటల తరువాత ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకొని తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు క్యూలో నిలిచివున్నారు. దీంతో చీకటి పడే వరకు పోలింగ్ కొనసాగింది.



వైసీపీ రాళ్ళ దాడిలో గాయపడిన బాజీ చౌదరిని పరామర్శిస్తున్న కన్నా

వైసీపీ దాడులు.. టీడీపీ శ్రేణులకు గాయాలు

అచ్చంపేట, మే 13 : మండలంలోని కొత్తపల్లిలో టీడీపీ, వైసీపీ శ్రేణులు పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. ఈ ఘటనలో టీడీపీకి చెందిన రంగిశెట్టి నవీన్ తలకు బలమైన గాయం కాగా, పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. అచ్చంపేటలో టీడీపీ నేత వెనిగండ్ల కోటయ్యపై వైసీపీకి చెందిన యువకుడు కడెంతో దాడిచేయంతో తలకు బలమైన గాయమైంది. ఇదే ఘటనలో బొర్రా నరసింహారావు తలకు గాయాలయ్యాయి. మాదిపాడులో వైసీపీ, టీడీపీ శ్రేణులు గొడవకు దిగారు. పోలీసులు ఇరువురిని చెదర గొట్టారు.

అమరావతి: మండల పరిధిలోని ఉంగుటూరు గ్రామంలో సోమవారం రాత్రి వైసీపీ మూకలు చేసిన దాడిలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలింగ్ ముగిసిన అనంతరం స్థానిక వైసీపీ నేత ధర్మతేజతో పాటు మరికొందరు టీడీపీ వర్గీయులపై కారం చల్లి రాళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో చిన్నం లావణ్య, గుండవరపు రమేష్‌లకు తలపై గాయాలయ్యాయి. వీరిని అమరావతిలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స చేశారు. టీడీపీ కార్యకర్తలపై దాడికి భాష్యం ప్రవీణ్ తీవ్రంగా ఖండించారు.

నకరికల్లు: నకరికల్లు మండలంలో కుంకలగుంట, చీమలమర్రి, రూపెనగుంట్ల గ్రామాల్లో టీడీపీ, వైసీపీల మధ్య రాళ్ళు, కర్రలతో దాడులు జరిగాయి. కుంకలగుంటలో జరిగిన రాళ్ళదాడిలో టీడీపీ నేత క నుమూరి బాజీచౌదరికి కనుమూరి రాజేంద్ర కుమారుడు మహేంద్ర తలకు గాయాలయ్యాయి. చీమలమర్రిలో పెమ్మసాని పాపయ్యతోపాటు మరికొందరు రాళ్ళదాడిలో గాయపడ్డారు. రూపెనగుంట్లలోను వైసీపీ దాడిలో టీడీపీకి చెందిన పలువురికి గాయాలయ్యాయి. కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ గాయపడిన బాజీ చౌదరిని పరామర్శించారు. కన్నాతో పాటు మన్నెం శివ నాగమల్లేశ్వరరావు, ఆవుల సుబ్బయ్య, డాక్టర్ సింగరాజు సాయికృష్ణలు ఉన్నారు.

గాయపడిన వారి పరిస్థితి ఆందోళనకరం

- మెరుగైన చికిత్సకోసం గుంటూరుకి తరలింపు

రెంటచింతల, మే 13: వైసీపీ శ్రేణుల దాడిలో గాయపడిన వారిలో పలువురి పరి స్థితి ఆందోళనకరంగా ఉంది. సోమవారం సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రెంటాల గ్రామంలో పోలింగ్‌కు 40నిమిషాల ముందు టీడీపీ నేతలపై వైసీపీకి చెందిన వారు దాడులు చేశారు. ఈ ఘటనకు సంబంధించి గొంటు నాగమల్లేశ్వరరెడ్డి, చేరెడ్డి మంజుల,చేరెడ్డి రాఘవరెడ్డి,చేరెడ్డి గోపాల రెడ్డి, గొంటు వెంకటేశ్వరరెడ్డి, పేరం సర్వారెడ్డిలు గాయపడ్డారు. వారిలో గొంటు నాగమల్లేశ్వరరెడ్డి,చేరెడ్డి గోపాలరెడ్డిల పరిస్థితి విషమంగాఉంది. మెరుగైన చికిత్సకోసం గుంటూరు ఆస్పత్రికి తరలించాలని వైద్యులు సూచించారు.



దాచేపల్లి మండలం, నడికుడిలో గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డిని అక్కడి ఓటర్లు పరుగులు పెట్టించారు. కాసు మహేష్‌రెడ్డి తన అనుచరులతో నడికుడి పోలింగ్ బూత్ వద్దకు వచ్చి అక్కడి ఓటర్లపై దౌర్జన్యం చేయడానికి ప్రయత్నించాడు. దీంతో గ్రామస్థులు ప్రతిఘటించి తిరగబడటంతో ఎమ్మెల్యే కాసు ఆయన అనుచరులతో పలాయనం చిత్తగించారు - దాచేపల్లి

ఉత్సాహంలో ఓటెత్తారు !



సత్తెనపల్లి పట్టణంలోని పోలింగ్ కేంద్రంలో ఓటర్లు

- ఉదయం నుంచే కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు
- ప్రారంభంలో మొరాయించిన ఈవీఎంలు
- పీవో వ్యవహారశైలిపై ఎన్నికల అధికారికి కన్నా ఫిర్యాదు
- వివిధ ప్రాంతాల్లో అల్లర్లు.. ఘర్షణలు..
- నకరికల్లు మండలం గుళ్లపల్లిలో ఈవీఎం ధ్వంసం

సత్తెనపల్లి, మే13: సత్తెనపల్లి నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుంచే ఓటర్లు బారులు తీరారు. ఓటు వేసేందుకు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చారు. మహిళా ఓటర్లు సైతం పోలింగ్ కేంద్రాలకు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. తమ అభిమాన నేతలను ఎన్నుకొనేందుకు ఎండను సైతం లెక్క చేయక క్యూలో నిల్చొన్నారు. కొన్ని పోలింగ్‌కేంద్రాల వద్ద ఈవీఎంలు మొరాయించాయి. పట్టణంలోని 55వ పోలింగ్‌కేంద్రంలో ఈవీఎంలు మొరాయించటంతో గంటకు పైగా క్యూలో ఉన్నామంటూ ఓటర్లు ఆందోళన వ్యక్తంచేశారు. హోలీ ఫ్యామిలీ హైస్కూల్లోని 40వ పోలింగ్ కేంద్రంలో పీవో రామ్మూర్తినాయక్ వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తుండటంపై కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. కన్నా లక్ష్మీనారాయణ, ఆయన కుటుంబ సభ్యులు హోలీ ఫ్యామిలీ హైస్కూల్లోని 52వ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. వైసీపీ అభ్యర్థి అంబటి రాంబాబు పార్కు ప్రాంతంలోని పోలింగ్‌కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొన్ని గ్రామాల్లో జరిగిన చిన్న చిన్న ఘటనలు, గందరగోళాలు నెలకొ న్నప్పటికీ వాటి ప్రభావం పోలింగ్ కేంద్రాలపై కన్పించలేదు.

రాజుపాలెం: మండలంలోని రాజుపాలెం, నెమలిపురి, అనుపాలెం తదితర గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించటంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. చాలాచోట్ల పోలింగ్ మందకూడిగా సాగింది. దీంతో రాజుపాలెం, నెమలిపురి గ్రామాలలో రాత్రి 8 గంటల వరకు కొనసాగింది. ఉప్పలపాడు, కొత్తబోధనం గ్రామాల్లో పోలింగ్‌బూత్‌ల వద్ద వైసీపీ మూక కవ్వింపు చర్యలకు పాల్పడింది.

స్వల్ప ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతం

అమరావతి, మే 13: పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని అమరావతి మండలంలోని కొన్ని గ్రామాలలో స్వల్ప ఘర్షణలు మినహా మిగిలిన గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు 69 బూత్‌లలో పోలింగ్ ప్రారంభమైంది. అమరావతి, మునగోడు, ధరణికోట, దిడుగు, ఎంద్రాయి గ్రామాల్లో స్వల్ప ఘర్షణలు జరిగాయి. దిడుగు గ్రామంలోని ఓ పోలింగ్ బూత్‌లో వైసీపీ శ్రేణులు దొంగ ఓట్లు వేస్తున్నారని టీడీపీ ఏజెంట్ ఈవీఎం కనెక్షన్ తొలగించాడు. అనంతరం అధికారులు కనెక్షన్‌ను పునరుద్ధరించారు. తహశీల్దార్ వెంకట రమణారావు, ఏఎస్పీ ఏఆర్ రాజు, సీఐ బ్రహ్మం పోలింగ్ పక్రియను పర్యవేక్షించారు. పోలింగ్ పూర్తయిన తర్వాత మల్లాది, అమరావతిలో ఉద్రిక్తత వాతావరణం నెలకుంది.

కొంత ఉద్రిక్తం.. ప్రశాంతం !

పిడుగురాళ: గురజాల నియోజకవర్గ పరిధిలోని గురజాల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాల పరిధిలో ఉదయం 6 గంటలకే ఓటర్లు ఓటు వేసేం దుకు బారులు తీరారు. పోలింగ్ కేంద్రాల వద్ద మధ్యాహ్నం 1గంట వరకు ఓటర్ల రద్దీ ఉండగా అనంతరం 3 గంటల నుండి 6 గంటల వరకు ఆదే రద్దీ కొనసాగింది. జానపాడు, పెదఅగ్రహారం, తండాస్కూల్ వద్ద ఇరు పార్టీల నేతలు కొద్దిపాటి వాగ్వివాదం, చెదురుమదురు సంఘటనలు మినహా మొత్తం మీద పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. పిడుగురాళ్ల మండలంలోని జానపాడు, కేశానుపల్లి, నడికూడి, ఇరికేపల్లి ప్రాంతాల్లో చెదురుమొదురు ఘర్షణలు చోటుచేసుకున్నాయి. తంగెడ మెయిన్‌రోడ్డులో వైసీపీ నేతలు పెట్రోలు బాంబులు విసరగా కొంతమంది ఓటర్లకు గాయాలయ్యాయి. ఇందుకు ప్రతి దాడిగా టీడీపీ నేతలు కూడా రాళ్లదాడికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. పిడుగురాళ్ల షాదీఖానా పోలింగ్ కేంద్రంలో ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు, ఆయన సతీమణి నాగమణి ఓటు హక్కు వినియోగించు కున్నారు. పిడుగురాళ్లలో ఓటింగ్ సరళిని ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, పార్టీ నేతలు పరిశీలించారు.

ఘర్షణలు.. తోపులాటలు.. పోలింగ్

క్రోసూరు : మండలంలో స్వల్ప ఘర్షణలు, తోపులాటలు వంటి చెదురుమదురు ఘటనల మధ్య పోలింగ్ ముగిసింది. మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు క్యూలలో బారులు తీరారు. దొడ్లేరులో టీడీపీ, వైసీపీ వర్గీయులు పరస్పరం రాళ్ళదాడులు చేసుకున్నారు. పోలీసులు జోక్యం చేసుకొని గుంపులను చెదర గొట్టినప్పటికీ స్వల్ప లాఠీ చార్జ్ చేసినప్పటికీ పలు దఫాలుగా గొడవలు జరిగాయి. ఎర్రబాలెంలో టీడీపీ కార్యకర్త కే.రామ్‌కుమార్‌పై వైసీపీ వర్గీయులు దాడిచేసి గాయ పరిచారు. ఆవులవారిపాలెంలో పోలింగ్ బూత్‌లోకి ఎమ్మెల్యే శంకరరావు సతీమణి వసంతకుమారి ప్రవేశంతో వివాదం చెలరేగింది. ఈవీఎంలో ఓటువేసే విషయంలో చెలరేగిన వివాదం ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ అక్కడకు చేరుకొని కార్యకర్తలకు నచ్చ జెప్పి సంయమనం పాటించేలా చేశారు. సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగింది.

గురజాలలో స్వల్ప ఉద్రిక్తతల మధ్య పోలింగ్

గురజాలటౌన్: మండల పరిధిలో సోమవారం స్వల్ప ఉద్రిక్తతల మధ్య పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. చెదురుమొదురు సంఘటనలు జరిగినప్పటికీ పోలీసులు, అధికారులు పోలింగ్ జరిపారు. గతంతో పోలిస్తే ఈ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఆసక్తి చూపినట్లు తెలుస్తోంది. యువత,



పిడుగురాళ్ల తండా స్కూల్ వద్ద ఉదయం 7 గంటలకే బారులు తీరిన ఓటర్లు



పెదకూరపాడులో ఓటును వినియోగించుకున్న కొమ్మాలపాటి శ్రీధర్ కుటుంబ సభ్యులు

మహిళలు అధికంగా ఓటు వేసేందుకు ముందుకొచ్చారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించారు. మండంలంలోని పల్లెగుంతలో ఈవీఎం మొరాయించడంతో 2గంటలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. దైద, తేలుకుట్ల, పల్లెగుంత, గురజాల పట్టణంలో పలుచోట్ల పోలింగ్ కేంద్రాల వద్ద స్వల్ప వివాదం జరిగింది. పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని చక్కబెట్టారు.

రెంటచింతల : మండలంలోని వివిధ గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లలో ఈవీఎంలను ధ్వంసం చేశారు. రెండు ప్రధాన పార్టీలకు చెందిన నేతలు పాలువాయిగేట్, తుమ్మకోట, జెట్టిపాలెం గ్రామాల్లో ధ్వంసం చేశారు.అనంతరం ప్రత్యామ్నాయ ఈవీఎంలను ఏర్పాటు చేసి సోమవారం రాత్రి వరకు పోలింగ్ నిర్వహిస్తూనే వున్నారు. రెంటచింతలకు చెందిన మధ్యప్రదేశ్ విశ్రాంత డీజీపీ బండి మరియకుమార్ సుబ్బన్నతోటలోని పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఎంతో కాలం మీ అరాచకం సాగదు..బ్రహ్మారెడ్డి

ఎంతో కాలం మీ అరాచకం సాగదు.. ఫ్యాన్ రెక్కలు విరగడం ఖాయం.. పోలింగ్‌కు ముందు చావబాదడమనేది ఇప్పుడే చూస్తున్నాను.. టీడీపీ శ్రేణులు ఆవేశానికి గురి కావొద్దు.. వచ్చే నెల జూన్ 4న అరాచక శక్తులను సీఎం చంద్రబాబు ఏరిపారేస్తారని విలేకరుల సమావేశంలో బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. పార్టీకోసం ఎంతో మంది దెబ్బలుతిన్నారు. ఇంటి పెద్దను కోల్పోయారు. మీ యోగక్షేమాలను చూసుకునే బాధ్యతనాదని భరోసానిచ్చారు.

దాచేపల్లి: రాష్ట్రంలోనే అత్యంత సమస్యాత్మక నియోజకవర్గమైన గురజాలలోని దాచేపల్లిలో ఓటింగ్ 70 నుండి 80 శాతం నమోదు కావడం విశేషం. పోలీసు సిబ్బంది సరిపడా లేరని, గొడవలు జరుగుతున్న తరుణంలో పోలీసు బలగాలను కూడా వైసీపీ నేతలు లెక్క చేయలేదని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి తన స్వగ్రామమైన దాచేపల్లి మండలంలోని గామాలపాడు లో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

నకరికల్లు: మండలంలో చేజర్ల, పాపిశెట్టిపాలెం, కుంకలగుంట, చీమలమర్రి గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించాయి. దీంతో సాయంత్రం 6 గంటల వరకు కొన్ని పోలింగ్ కేంద్రాల్లో వందల సంఖ్యలో ఓటర్లు బారులు తీరి ఉన్నారు. దీంతో పోలింగ్ ఆలస్యమైన కేంద్రాల్లో రాత్రి 10 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుంది. కుంకలగుంటలోని 219 పోలింగ్ కేంద్రంలో దాదాపు 4 గంటల వరకు అల్లర్ల కారణంగా పోలింగ్ నిలిచి పోయింది. కన్నా లక్ష్మీనారాయణ, కుంకలగుంటతో పాటు పలు గ్రామాల్లో పోలింగ్ సరళిని పరిశీలించారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగోతు శౌరయ్య మండలంలోని గ్రామాల్లో పర్యటించి పోలింగ్ సరళిని పర్యవేక్షించారు.

గుళ్ళపల్లి గ్రామంలో వైసీపీ వర్గీయులు పోలింగ్ బూత్‌లోకి చొరబడి అలజడి సృష్టించారు. ఈవీఎంను పగులకొట్టి ఎన్నికల సామగ్రిని ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఘటనా ప్రదేశానికి చేరుకొని పరిశీలించారు. ఆయనతోపాటు తహసీల్దార్ ఉన్నారు.

మాచవరం: మాచవరం మండల గ్రామాల్లో జరిగిన ఎన్నికల పోలింగ్ ప్రక్రియ లో చెదురుమదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. వేమవరం, చెన్నాయపాలెం, మోర్జంపాడు, రేగులగడ్డ, కొత్తగణేశునిపాడు తదితర గ్రామాలలో చెదురుమదురు సంఘటనలు ఇరుపార్టీల నాయకులు ఒకరినొకరు నెట్టుకోవడం, పోలింగ్ బూత్‌ల వద్ద చిన్న చిన్న వివాదాలు తప్ప చెప్పుకోదగ్గ సంఘటనలు చోటు చేసుకోలేదు. వేమవరంలోని 144 బూత్‌లో మొదట్లో ఈవిఎం కొద్దిసేపు మొరాయించడంతో సుమారు అర్ధగంటపాటు ఓటింగ్ ప్రక్రియ ఆలస్యంగా ప్రారంభమైంది.

కూటమి గెలుపుపై నేతల ధీమా

- కారంపూడి పట్టణంలో కూటమి నేతలు, యువకుల ర్యాలీ

కారంపూడి, మే 13: మండలంలో 80 శాతం పోలింగ్ పూర్తి కాగానే కూటమి శ్రేణులు తమ నేత బ్రహ్మారెడ్డి గెలుస్తారనే ధీమా వ్యక్తపరుస్తూ మండల కేంద్రమైన కారంపూడిలో కూటమి నేతలు, యువకులు సోమవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బాణాసంచా కాల్చుతూ 'బ్రహ్మారెడ్డి జిందాబాద్, శ్రీకృష్ణ దేవరాయలు జిందాబాబు, జై చంద్రబాబు' అంటూ నినాదాల తో హోరెత్తించారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అభిమానులు స్వీట్లు పంచారు. బానిస సంకెళ్ల తెగిపోయి స్వేచ్ఛా వాతావరణం లభించిందని రోడ్ల పైకి పరుగులు పెట్టారు.

రెచ్చిపోయిన వైసీపీ మూక

- రాళ్లు, బీరు సీసాలతో దాడి
- టీడీపీ నేతకు గాయాలు

రాజుపాలెం,మే13:మండలంలో జరిగిన సాధారణ ఎన్నికల్లో వైసీపీ రాళ్లు, కర్రలు, బీరు సీసాలతో దాడి దిగింది. సోమవారం ఉదయం పోలింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే మండలంలోని బలిజేపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు పల్లపాటి పెద్దిరాజు తండ్రి రాములపై అదే గ్రామానికి చెందిన వైసీపీ వారు దాడి చేశారు. ఈ దాడిలో రాములుకు గాయమైంది. గాయపడిన రాములును చికిత్స నిమిత్తం సత్తెనపల్లి వైద్యశాలకు తరలించారు. అదే విధంగా కొత్తబోధనం గ్రామంలో వైసీపీ వారు పథకం ప్రకారం దాడి చేశారు. పోలింగ్ పక్రియ పూర్తి అయిందని అందరూ బావిస్తుండగా వైసీపీ వారు పథకం ప్రకారం వీధి లైట్లు ఆపి ఒక్కసారిగా రాళ్లు, కర్రలు, బీరు సీసాలతో దాడి చేశారు. ఈ దాడిలో తెలుగుదేశం పార్టీకి చెందిన తోట శ్రీనివాసరావు, తోట రాంబాబు, తోట ఆంజనేయులు, గుడిపాటి సుధాకర్, గుడిపాటి కృపారావులకు గాయలైయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం సత్తెనపల్లి తరలించారు. ఉప్పలపాడు, గణపవరం గ్రామంలో ఎప్పుడు ఏమి జరిగిదో అని ప్రజలు భయపడుతున్నారు.

బారులు తీరిన ఓటర్లు

- రాత్రి 11 గంటల వరకు పోలింగ్
- వివిధ పోలింగ్ బూత్‌ల వద్ద ఘర్షణలు

పెదకూరపాడు, మే 13 : పెదకూరపాడు మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ఉదయం 6:30 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. పెదకూరపాడు మండలంలోని గారపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభించాల్సి ఉండగా ఈవీఎంలు మొరాయించటంతో 149వ పోలింగ్ కేంద్రంలో 8:15 గంటలకు, 150వ పోలింగ్ కేంద్రంలో 8 గంటలకు గంట ఆలస్యంగా పోలింగ్ మొదలైంది. మండలంలోని 187వ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మిషన్ ఆగి పోవటంతో సుమారు గంటా 50 నిమిషాల పాటు పోలింగ్ లేటుగా ప్రారంభ మైంది. పెదకూరపాడు 167వ పోలింగ్ కేంద్రం వద్ద ఈవీఎం పని చేయక పోవటంతో గంట పాటు పోలింగ్ నిలిపి వేశారు. ఉదయం నుంచి మండుటెండను లెక్క చేయకుండా ఉక్కపూతతో అల్లాడుతూ గంటల తరబడి క్యూలో నిల్చొని ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఓటు హక్కును వినియోగించుకున్న కొమ్మాలపాటి..

పెదకూరపాడు జిల్లాపరిషత్ హైస్కూల్లో మాజీ ఎమ్మెల్యే టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, ఆయన సతీమణి మాధవీలత, ఆయన కుమారుడు సాయిసుధాకర్, ఆయన సతీమణి, సోదరిలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పెదకూరపాడు ఎమ్మెల్యే, వైసీపీ నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నంబూరు శంకరరావు మండలంలోని 75 తాళ్ళూరులో ఓటు హక్కును వినియోగించుకున్నారు. పెదకూరపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ గుంటూరు జిల్లాలోని తుళ్ళూరు మండలం పెద పరిమిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మందకొడిగా పోలింగ్.. పెదకూరపాడు, బలుసుపాడు గ్రామాల్లో పోలింగ్ మందకొడిగా సాగింది. వృద్ధులకు, దివ్యాంగులకు, వీల్ చైర్‌లు ఏర్పాటుచేయటంతో అధికారులుర విఫలమయ్యారు. పలు చోట్ల తాగు నీటి సౌకర్యాన్ని కూడా పూర్తి సాకథయిలో కల్పించ లేక పోయారు. దీంతో ఓటర్లు ఇబ్బందులకు గురయ్యారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

స్వల్ప ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతం

● నరసరావుపేట, వినుకొండ, చిలకలూరిపేట ప్రాంతాల్లో టీడీపీ, వైసీపీ మధ్య ఘర్షణ.. పలువురికి గాయాలు
● పెరిగిన పోలింగ్ శాతం ● పెద్ద సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకున్న యువకులు, వృద్ధులు



వినుకొండ మండలం ఉమ్మడివరంలో ఓటు వినియోగించుకోవడానికి బారులు తీరిన ఓటర్లు



వినుకొండ లయోలా పాఠశాల పోలింగ్ బూత్ వద్ద బారులు తీరిన ఓటర్లు



చందవరంలో బారులు తీరిన ఓటర్లు



ఎస్ఎస్‌పీ కాలనీలోని 217వ బూత్‌లో బారులు తీరిన మహిళలు



ఈపూరు, యడ్లపాడు, వినుకొండలో బంధువుల సాయంతో ఓటు హక్కు వినియోగించుకోవడానికి వస్తున్న వృద్ధులు

పమిడిపాడు (నరసరావుపేట రూరల్), మే 13: మండలంలోని పమిడిపాడు గ్రామంలో టీడీపీ, వైసీపీవర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో ఇరు వర్గాలకు చెందిన పలువురుకి తీవ్ర గాయాలయ్యాయి. గత రెండు రోజులుగా గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు గ్రామంలో ఓటర్లను బెదిరించేందుకు, రిగ్గింగ్ చేసేందుకు విశ్వప్రయత్నం చేశారు. సోమవారం ఉదయం పోలింగ్ ప్రారంభం కాగానే ఓటర్లను భయభ్రాంతులు చేస్తూ పలుమార్లు మూకుమ్మడిగా పోలింగ్ బూత్‌లవైపు వచ్చేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారు. దీంతో వారిని టీడీపీ, జనసేన కార్యకర్తలు అడ్డుకునే నేపథ్యంలో ఇరువర్గాల మధ్య తీవ్రమైన ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన కార్యకర్తలు ఒకరిపై ఒకరు రాళ్ళు విసురుకున్నారు. దీంతో ఇరువర్గాలకు చెందిన కార్యకర్తలకు తీవ్రగాయాలయ్యాయి. పోలింగ్ బూత్‌వద్ద ఉన్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందించారు. సమాచారం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ రోశయ్య, బాలకృష్ణ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు.

రొంపిచర్ల మండలంలో...

రొంపిచర్ల, మే 13: మండలంలోని గ్రామాల్లో స్వల్ప సంఘటనలు మినహా సోమవారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచి అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు కొంతమేర మొరాయించటంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. రామిరెడ్డిపాలెం, వీరవట్నం గ్రామాల్లో మాక్ పోలింగ్ సమయంలో స్లిప్‌ల సంఖ్య తక్కువ రావటంతో వాటిని సరిచేశారు. అన్నవరం, ఆరేపల్లి గ్రామాల్లో ఏజెంట్ల మధ్య, రెండోసారి ఓటు వేసుకొనే సమయంలో స్వల్ప ఘర్షణలు తలెత్తాయి. వీటిని అక్కడ ఉన్న పోలీసులు సర్దిచెప్పి మరలా పోలింగ్‌ను నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు హైదరాబాద్, బెంగుళూరు, మద్రాసు తదితర ప్రాంతాల్లో ఉన్న వారు ఓటు హక్కు వినియోగించుకొనేందుకు భారీ సంఖ్యలో స్వగ్రామాలకు తిరిగి వచ్చారు. కర్లకుంటలోని 27వ పోలింగ్ కేంద్రంలో ఉదయం 10:40 గంటలకు క్యూలైన్‌లు ఖాళీగా దర్శనమిచ్చాయి. 25, 26 పోలింగ్ కేంద్రాల్లో భారికేడ్లు లేకపోవటంతో ఇబ్బందులకు గురయ్యారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద దివ్యాంగుల కోసం వీల్ ఛైర్‌లు ఏర్పాటు చేశారు. గోగులపాడు గ్రామంలోని పోలింగ్ కేంద్రాల వద్ద డీఎస్పీ లక్ష్మీనారాయణ, సీఐ శోభన్ బాబు, బీఎస్ఎఫ్ బలగాలు బందోబస్తును పర్యవేక్షించాయి. అధిక శాతం మధ్యాహ్నం 2గంటల సమయానికి పోలింగ్ పూర్తయింది. నరసరావుపేటకు చెందిన ఎస్ఎస్ఎన్ కళాశాల, తిరుమల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు పోలింగ్ కేంద్రాల వద్ద సేవలందించారు. మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతంగా ముగియటంతో అటు అధికారులు, ఇటు రాజకీయ పార్టీల నేతలు ఊపిరి పీల్చుకున్నారు.

అలవాలలో పోలింగ్ ఆలస్యం

రొంపిచర్ల, మే 13: మండలంలోని అలవాల గ్రామంలో 44, 45 పోలింగ్ కేంద్రాల్లో అలవాల, అచ్చయ్యపాలెం గ్రామాలకు చెందిన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైనా సాయంత్రం ఐదు గంటల సమయానికి కూడా క్యూలైన్‌లలో ఓటర్లు నిల్చొని ఉన్నారు. పోలింగ్ ఎందుకు ఆలస్యమవుతుందో అర్థంకాక ఆగ్రహం వ్యక్తంచేశారు. అడగటానికి ఎవ్వరూ లేకపోవటంతో నిరాశచెందారు. అర్థరాత్రి వరకు ఇక్కడ పోలింగ్ కొనసాగింది.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

రొంపిచర్ల, మే 13 : మండలంలోని రొంపిచర్ల గ్రామంలో గల పోలింగ్ కేంద్రాలను ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

వినుకొండలో...

వినుకొండ , మే 13: వినుకొండ నియోజకవర్గంలో ఎన్నడు లేని విదంగా ఉదయం 6గంటలకే పోలింగ్ బూత్‌ల వద్ద మహిళలు, యువకులు బారులు తీరారు. గతంలో జరిగిన ఎన్నికలకు ఇప్పుడు జరుగుతున్న ఎన్నికలకు చాలా వ్యత్యాసం ఉంది. ఎండను సైతం లెక్కచేయకుండా ముఖ్యంగా మహిళలు, యువకులు ఉత్సాహంగా 2గంటలకు పైగా క్యూలైన్లలో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పోలీసులపై బొల్లా చిర్రుబుర్రు

ఉదయం నుంచి ఓట్లు వేసేందుకు ప్రజలు బారులు తీరడంతో వైసీపీ అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు పోలీసులు, పోలింగ్ అధికారులపై చిర్రుబుర్రులాడారు. నియోజకవర్గంలోని నూజండ్ల మండలంలోని జంగాలపల్లి గ్రామంలో 258, 259 రెండు పోలింగ్ బూత్‌లు అధికారులు ఏర్పాటుచేశారు. ఈ గ్రామం టీడీపీకి కంచు కోటలాంటిది. 259 పోలింగ్ బూత్‌లో ఓట్లు జరుగుతున్న ప్రక్రియలో టీడీపీ, వైసీపీ ఏజెంట్ల మధ్య స్వల్ప వాగ్వివాదం చోటుచేసుకుంది. వైసీపీ ఏజెంట్ కిషోర్ ఉద్దేశపూర్వకంగా ఈవీఎంను కిందపడవేశారు. దీంతో ఈవీఎం మొరాయించడంతో పోలింగ్ నిలిచిపోయింది. వైసీపీ అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడుకు ఆ పార్టీ నాయకులు జంగాలపల్లిలో గొడవ జరుగుతుదనే సమాచారాన్ని చేరవేశారు. దీంతో జంగాలపల్లి గ్రామానికి చేరుకున్న బొల్లా బ్రహ్మనాయుడు పోలింగ్ జరిగే ప్రదేశానికి వచ్చి ఎస్ఐపై విరుచుకుపడ్డారు. అంతటతో ఆగకుండా 258 పోలింగ్ బూత్‌లో ఉన్న అధికారులను పోలింగ్ నిలుపుదల చేయాలంటూ ఆగ్రహంతో ఊగిపోయి కొంతసమయం పోలింగ్‌ను ఆపివేయడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న, మాజీ ఎమ్మెల్యే, చీఫ్ ఏజెంట్ మక్కెన మల్లికార్జునరావు అక్కడకు చేరుకొని పోలింగ్ అధికారులతో వైసీపీ అభ్యర్థిని బయటకు పంపించి వెంటనే పోలింగ్ జరపాలని కోరారు. అప్పటికే సుమారు రెండు గంటల వరకు 259బూత్‌లో పోలింగ్ నిలిచిపోయింది. ఇంత జరుగుతున్నా బ్రహ్మనాయుడు అక్కడ నుంచి కదలకపోవడంతో బొల్లాను పంపించాలని మక్కెన భీష్మించుకుని కూర్చొన్నాడు. ఒక సమయంలో ఇరువర్గాల ఘర్షణపడే స్థాయికి చేరుకుంది. ఈ సమయంలో డీఎస్పీ శ్రీనివాసులు, అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతిలు వచ్చి వివాదాన్ని సద్దుమణిగించారు. తర్వాత మొరాయించిన ఈవీఎం స్థానంలో మరో ఈవీఎం ఏర్పాటుచేసి పోలింగ్‌ను కొనసాగించారు.



రవ్వవరంలో బారులు తీరిన మహిళలు



రొంపిచర్లలో ఓటుహక్కును వినియోగించుకున్న శతాధిక వృద్ధురాలు

పోటెత్తిన ఓటర్లు

వినుకొండ, మే 13: వినుకొండ నియోజకవర్గంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల కోసం ఓటర్లు పోటెత్తారు. ఉదయం 5:30నిమిషాలకే పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు బారులుతీరారు. మహిళలు, యువకులతోపాటు వృద్ధులు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి పోటీపడ్డారు. పంచాయతీ తరహాలో నియోజకవర్గంలో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్వగ్రామాల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు వ్యయప్రయాసలతో ఇతర దేశాల్లో ఉన్న వారు, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలతోపాటు ఇతర దేశాల నుంచి కూడా స్వగ్రామాలకు చేరుకొని ఓటు హక్కును వినియోగించుకోవడం గమనార్హం.

ఈవీఎంల మొరాయింపు

ఈవిఎంలు కొన్ని చోట్లు మొరాయించడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వినుకొండ మండలం ఉమ్మడివరంలో ఒక పోలింగ్ బూత్‌లో ఈవియం పనిచేయకపోవడంతో ఉదయం 9:30గంటల వరకు కూడా పోలింగ్ జరగలేదు. బొల్లాపల్లి మండలం వడ్డెంగుంట గ్రామం బూత్ నెం:59లో ఈవీఎం మొరాయించడంతో గంటసేపు ఆలస్యంగా పోలింగ్ మొదలైంది. ఈపూరు మండలంలో అంగలూరు, కొచ్చర్ల, గుండేపల్లి గ్రామాల్లో వీవీపాట్ మొరాయించడంతో ఇక్కడ కూడా ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. నూజండ్ల మండలం ముత్యంజాపురం 217వ బూత్, వినుకొండ పట్టణంలో జూనియర్ కాలేజి ఆవరణలోని 198బూత్, ఎస్ఎస్‌పి కాలనీలోని 219వ బూత్‌ల ఈవీఎంలు మొరాయించడంతో సుమారు గంటసేపు తర్వాత మొదలైంది. శావల్యాపురం మండలం కారుమంచిలో సాయంత్రం 6:30నిమిషాలకు 136వ బూత్‌లో టెక్నికల్ సమస్యతో ఈవీఎంలు ఆగిపోవడడం, వీవీ ప్యాడ్లు అయిపోయాయని ఎన్నికల అధికారి పోలింగ్ నిలుపుదలచేశారు. అప్పటికే 200మందికి పైగా ఓటర్లు క్యూలో ఉన్నారు. ఒక గంట తర్వాత సమస్యను పరిష్కరించి మరల పోలింగ్ యధావిధిగా కొనసాగిస్తున్నారు.

పలు చోట్ల ఘర్షణలు...

వినుకొండనియోజకవర్గంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పలు చోట్ల ఘర్షణలు చోటుచేసుకున్నాయి. నియోజకవర్గంలోని నూజండ్ల మండలంలో నూజండ్లలో ఓటు వేయడానికి వచ్చిన ఒక యువతిని వీడియో తీస్తుండగా ఎందుకు తీస్తున్నారని ప్రశ్నించడంతో స్వల్ప ఉద్రిక్తతో చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న ఫ్లైయింగ్ స్క్వాడ్ పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకొని పోలింగ్ బూత్‌ల ఆవరణ నుంచి బయటకు పంపిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు రాళ్ళు వేయడంతో త్రివేణి అనే యువతి గాయపడింది. పాత చెరుకుంపాలెంలో జడ్పీటీసీ జెడ్డా సుబ్బులు భర్త రామయ్యపై వైసీపీ నాయకులు రాళ్ళ దాడి చేయడంతో గాయాలయ్యాయి. పాతనాగిరెడ్డిపల్లె, అప్పాపురం, పాత చెరుకుంపాలెం, ఉప్పలపాడు, వినుకొండ మండలం విఠంరాజుపల్లిలో కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు పోలింగ్ సరళిని పరిశీలించడానికి వచ్చిన సమయంలో వైసీపీ మూకలు అడ్డుకొని అల్లర్లకు పాల్పడడంతోపాటు పోలీసులు రంగప్రవేశంచేసి చెదరగొట్టడంతో గొడవ సద్దుమణిగింది. ఈ సమయంలో వైసీపీ వారు స్క్వాడ్ కెమెరాను పగులకొట్టినట్లు తెలిసింది. ఈపూరు మండలం కొచ్చర్లలో కూడా వైసీపీ నాయకులు బూత్‌లోకి వచ్చి బయటకు పోకపోవడంతో ఘర్షణ మొదలవడంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు సమస్యను పరిష్కరించారు. వినుకొండ మండలంలో చాట్రగడ్డపాడు, నాగిరెడ్డిపల్లె గ్రామాల్లో కూడా స్వల్ప వివాదాలు చోటుచేసుకున్నాయి. ఈ సంఘటనల్లో ముగ్గురికి గాయాలయ్యాయి.



జంగాలపల్లిలో వైసీపీ అభ్యర్థి బొల్లాతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

ఓటు హక్కు వినియోగించుకున్న నేతలు...

కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు సతీమణి గోనుగుంట్ల లీలావతితో పట్టణంలోని 196వ బూత్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వైసీపీ బొల్లా బ్రహ్మనాయుడు స్వగ్రామమైన శావల్యాపురం మండలం వేల్పూరులో, మాజీ ఎమ్మెల్యేలు మక్కెన మల్లికార్జునరావు, వీరపనేని యలమందరావులు కూడా ఓటు హక్కు వినియోగించుకున్నారు.

కొనసాగుతున్న పోలింగ్

వినుకొండ నియోజకవర్గంలో రాత్రి 8గంటల వరకు కూడా పోలింగ్ కొనసాగుతోంది. వినుకొండ పట్టణంలో 217, అంబేద్కర్ కాలనీతోపాటు ఈపూరు మండలం కొచ్చర్ల, ఉప్పరపాలెం, నూజండ్ల మండలం ఐనవోలు, రవ్వవరం, అప్పాపురం, శావల్యాపురం మండలం కారుమంచి, బొల్లాపల్లి మండలం పేర్లపాడు, రేమిడిచర్ల, కనుమలచెరువు, బొల్లాపల్లి,చక్రాయపాలెంలో పోలింగ్ కొనసాగుతోంది.

బొల్లాపల్లి మండలంలో ...

బొల్లాపల్లి, మే 13: మండలంలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 8 గంటల వరకు కొనసాగుతూనే ఉంది. కొన్ని గ్రామాల్లో పోలింగ్ మందకొడిగా సాగుతుండగా మరికొన్ని గ్రామాల్లో ఓటర్లు భారీఎత్తున బారులుతీరి కన్పించారు. కాగా మండలంలో చెదురుమదురు ఘటనలు తప్ప పోలింగ్ ప్రశాంతంగా సాగింది.

నాదెండ్ల మండలంలో ...

నాదెండ్ల, మే 13: మండలంలోని పలు గ్రామాల్లో సార్వత్రిక ఎన్నికలు ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. కొన్ని గ్రామాల్లో అప్పుడప్పుడు టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య ఉద్రిక్తలు నెలకొన్నాయి. గణపవరం, సాతులూరు, నాదెండ్లతో పలు గ్రామాల్లోని 57 పోలింగ్ బూత్‌లలో ఓటర్లు ఉదయానే ఓటు వేసేందుకు బారులు తీరారు. గణపవరం గ్రామంలో ఒక వలంటీర్ పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లను ప్రభావితం చేస్తుండటంతో ఆ విషయంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. గొరిజవోలు గ్రామంలో పోలింగ్ బూత్‌లో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి సుమారు గంటపాటు పోలింగ్ నిలిచిపోయింది. అదేవిధంగా బుక్కాపురం గ్రామంలో వైసీపీ తరుపున పోలింగ్ ఏజెంట్‌గా కూర్చున్న వ్యక్తి ఫ్యాన్‌కు ఓటు వేయాలంటూ ఓటర్లకు చెప్పటంతో వివాదం చెలరేగింది. ఆ సమయంలో అక్కడకు వచ్చిన టీడీపీ నేత మల్లెల రాజేష్ నాయుడుకు వైసీపీ వర్గాల మధ్య వాగ్వివాదం జరిగింది. పలు గ్రామాల్లో పోలింగ్ సందర్భంగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని పోలీసులు చెప్పగా కాని ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు చాలినంతగా లేకపోవటంతో పలు మార్లు ఉద్రిక్తలు ఏర్పడ్డాయి.

యడ్లపాడు మండలంలో...

యడ్లపాడు, మే 13: మండలంలో 2024 సార్వత్రిక ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. యడ్లపాడు మండలంలోని 18 గ్రామపంచాయతీలలో 44,381 మంది ఓటర్లు ఉండగా, వీరంతా ఓటు వేసేందుకు వీలుగా ఆయా గ్రామాల పరిధిలో 57 పోలింగ్ బూత్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికలలో సుమారు 80శాతంకు పైగా ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

పలు బూత్‌లలో 90శాతానికిపైగా పోలింగ్

యడ్లపాడులో 93, బోయపాలెం 80, జాలాదిలో 106, వంకాయలపాడులో 75, కొండవీడులో 59, సొలసలో 67 బూత్‌లలో ఈవీఎంలు మొరాయించడంతో గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. పోలింగ్ ఆలస్యమైనప్పటికి సొలస 65, 66 బూత్‌లలో 92శాతం, లింగారావుపాలెంలోని 71,73 బూత్‌లలో 96శాతం, 72లో 90శాతం, కోట 61 బూత్‌లో 9శాతం, దింతెనపాడు 96, 97లలో 90శాతం, గుత్తావారిపాలెం 110 బూత్‌లో 90శాతంకుపైగా పోలింగ్ నమోదయ్యింది. కాగా యడ్లపాడు లూథరన్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన 9 పోలింగ్ బూత్‌లలో 87శాతంకు పైగా నమోదుకావడం విశేషం. ఇది గత సార్వత్రిక ఎన్నికల కన్నా 3శాతం అధికం.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట, మే 13: చిలకలూరిపేట నియోజకవర్గం సోమవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది మాక్ పోలింగ్ సందర్భంగా కొన్ని పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలు పనిచేయలేదు. వెంటనే బెల్ కంపెనీ ఇంజనీర్లు వాటిని సరిదిద్దారు. అనంతరం పోలింగ్ సజావుగా సాగింది. ఉదయం 6 గంటల నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద పెద్ద సంఖ్యలో ఓటర్లు క్యూలలో నిలబడి ఓట్లు వేయటానికి వచ్చారు. మహిళలతో సహా పలువురు మూడు నాలుగు గంటల పాటు క్యూలలో నిల్చుని ఓట్లువేసి వెళ్లారు. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి క్యూలైన్లలో ఉన్న ఓటర్లకు ప్రత్యేకంగా స్లిప్పులు ఇచ్చి వారిని ఓటింగ్‌కు అనుమతించారు. పలు పోలింగ్ కేంద్రాలలో ఈ ప్రక్రియ రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగింది. సాయంత్రం ఐదు గంటల వరకు 72% ఓటింగ్ జరిగింది. చిలకలూరిపేట మున్సిపాలిటీలో విలీనమైన పెద్ద గ్రామాలైన పసుమర్రులో 89 శాతం ఓట్లు పోలయ్యాయి. గణపవరంలో 88శాతం ఓట్లు పోలయ్యాయి.

కావూరులో టీడీపీ వారిపై వైసీపీ శ్రేణుల దాడి

చిలకలూరిపేట, మే 13: చిలకలూరిపేట మండలం కావూరు గ్రామంలో సోమవారం సాయంత్రం తీవ్ర ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. పోలింగ్ ముగిసే సమయంలో 211నంబరు బూత్ వద్ద వైసీపీ శ్రేణులు కవ్వింపు చర్యలకు దిగారు. టీడీపీ వారిని బూత్ వద్దకు వచ్చి ఓటు వేయనివ్వకుండా చేయడం కోసమే వారిపై రాళ్లరువ్వారని గ్రామస్థులు తెలిపారు. తక్కువ సంఖ్యలో ఉన్న పోలీసులు వారిని అదుపు చేయలేకపోయారు. వైసీపీ శ్రేణులు రాళ్ల దాడి చేయడంతో గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో కోడె ఉమామహేశ్వరరావు, మాలెంపాటి చరణ్, మద్దుల వెంకటప్రసాద్ ఉన్నారు. వీరందరూ చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరు గంటల ప్రాంతంలో బూత్ లోపల ఉన్న వారికి ఓటు వేయడానికి అవకాశం కల్పించారు. అయితే సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో ఓటు వేయటానికి పలువురు అక్కడకు చేరుకుంటున్న సందర్భంలో వారిని బూత్‌లోకి వెళ్ళకుండా వైసిపి వారు ఈ దాడులకు పాల్పడ్డారు. దాడి కారణంగా గ్రామస్థులు పలువురు ఓటు వేయలేకపోయారు.

వినుకొండలో...

వినుకొండ టౌన్, మే 13: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని వినుకొండ పట్టణంలో ఓటింగ్ ప్రశాంతంగా ముగిసింది. ప్రధానంగా పట్టణంలో మహిళలు, యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణంలో మొత్తం 45పోలింగ్ బూత్‌లు ఉండగా సుమారు 45వేల మేరకు ఓటర్లలో 80శాతం మేరకు ప్రజలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. బాలికల పాఠశాలలో 184వ బూత్ 7గంటలకు ప్రారంభం కావాల్సిన పోలింగ్ సుమారు గంటసేపు ఆలస్యం కావడంతో ఓటర్లు ఓర్పుతో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అంబేద్కర్ నగర్ వాసులు పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొన్నారు. 3వ వార్డులో 217వ బూత్‌లో రాత్రి 10గంటల వరకు ఓటర్లు క్యూలైన్‌లో నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

స్వల్ప ఘర్షణలు..

పట్టణంలోని బాలికల పాఠశాలలో ఏర్పాటుచేసిన 184వ బూత్‌కు సంబంధించిన వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య కొద్దిపాటి ఘర్షణ ఏర్పడింది. వైసీపీకి చెందిన కొందరు యువకులు ఓటర్ల వద్దకు వెళ్ళి సంక్షేమ పథకాలను గురించి ప్రచారం చేయడంతో గమనించిన టీడీపీ నాయకులు పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకొని హెచ్చరించారు. పోలీసులు కలుగచేసుకొని ఇరువర్గాలను అక్కడ నుండి చెదరకొట్టారు. విఠంరాజుపల్లిలోని బధిరుల పాఠశాల్లో ఏర్పాటుచేసిన పోలింగ్ బూత్ వద్ద రామకోటి అనే దివ్యాంగుడితో ఓటు వేయించేందుకు తమ కుమారుడు సుబ్బయ్య తీసుకువెళ్తుండగా వైసీపీ నాయకులు అడ్డుకోవడంతో ఘర్షణ చోటుచేసుకుంది. పోలింగ్ బూత్ వద్ద ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేయడం, స్క్వాడ్ అధికారులను సైతం నెట్టివేయడంతో అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొంది. సమాచారం తెలుసుకున్న జీవీ ఆ ప్రాంతానికి చేరుకోవడంతో అక్కడ ఘర్షణలు సద్దుమణిగాయి. ఇదిలా ఉండగా బ్రాహ్మణపల్లి పంచాయితీ పరిధిలోని నాగిరెడ్డిపల్లె వద్ద వైసీపీ నాయకులు టీడీపీ కార్యకర్తపై దాడి చేయటంతో బలమైన గాయం అయింది. అతనిని వినుకొండ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు, జీవీ అతనిని పరామర్శించారు.

రాత్రి 10 గంటల వరకు కొనసాగుతున్న పోలింగ్

ఈపూరు, మే 13: సార్వత్రిక ఎన్నికలు ఈపూరు మండలంలో చెదురుమదురు సంఘటనలు తప్ప ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో 46 పోలింగ్ బూత్‌లలో 39వేల480 ఓట్లు ఉన్నాయి. ముఖ్యంగా మహిళలు, యువతీ, యువకులు అధిక సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఉదయం 6 గంటల నుంచి క్యూలైన్‌లో బారులుతీరారు. రాత్రి 10గంటల వరకు పోలింగ్ జరుగుతూనే ఉంది. కొచ్చెర్ల గ్రామంలో వైసీపీ మూకలు కవ్వింపు చర్యలకు దిగినప్పటికీ టీడీపీ వాళ్ళు సంయమనం పాటించారు. కొచ్చెర్ల, గుండేపల్లి, చిట్టాపురం గ్రామాలలో ఈవీఎంలు గంటపాటు మొరాయించాయి. పోలింగ్ బూతులలో కొన్ని చోట్ల లోపలికి వెళ్ళే దారినే మళ్ళీ బయటకు రావాల్సి ఉండడంతో ఓటర్లు బాగా ఇబ్బంది పడ్డారు.

దొండపాడులో రీపోలింగ్ నిర్వహించాలి: శ్రీకృష్ణ దేవరాయలు

దొండపాడు, మే 13: దొండపాడులో జరిగిన దాడులపై ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ వైసీపీ మూకలు పల్నాడు జిల్లాలో ప్రజావ్యతిరేకతను జీర్ణించుకోలేక అల్లర్లు సృష్టించి ప్రజలను బయభ్రాంతులకు గురిచేసి రిగ్గింగ్ చేసేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నారన్నారు. దొండపాడులో జరిగిన ఘటనను రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకువెళ్ళి దొండపాడు గ్రామంలో రీపోలింగ్ జరపాలని కోరనున్నట్లు తెలిపారు.

నూజెండ్ల మండలంలో ...

నూజెండ్ల, మే 13: నూజెండ్ల మండలంలోని 59 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రాజకీయ పార్టీల వాగ్వాదాలు, ఘర్షణల మధ్య ఉద్రిక్తత భరితంగా జరిగింది. ఉదయం ఓటు హక్కును వినియోగించుకొనేందుకు మండలంలోని ఓటర్లు 7 గంటలకు వందల సంఖ్యలో బారులు తీరి నిల్చున్నారు. పోలింగ్ మందకొడిగా సాగటంతో మూడు నుంచి నాలుగు గంటలకు పైగా క్యూలైన్‌లో ఓటర్లు నిల్చొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఐనవోలు, రవ్వవరం, వీ అప్పాపురం గ్రామాల్లో 6 గంటల తరువాత కూడా ఓటర్లు క్యూలైన్‌లో ఉండటంతో వారికి అధికారులు స్లిప్‌లు పంపిణీ చేశారు. ఐనవోలులో రాత్రి 9 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. మండలంలోని మృత్యుంజాపురం 246 పోలింగ్ స్టేషన్‌లో వీవీ ప్యాడ్ పని చేయటంతో ఒకే ప్రాంగణంలో ఉన్న 245, 246 పోలింగ్ స్టేషన్‌లలో గంటా 15 నిమిషాలు పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. జంగాలపల్లి గ్రామంలోని 259 పోలింగ్ బూత్ వద్దకు ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావులు రావటంతో ఘర్షణ వాతావరణం నెలకుంది. ఓటర్లు తోపులాటలో వీవీ ప్యాట్ కింద పడిపోవటంతో మరో వీవీ ప్యాట్‌ను తెప్పించి ఓటింగ్‌ను పునఃప్రారంభించారు. వీ అప్పాపురం, కొత్తజెడ్డావారిపాలెం, చెరువుకొమ్ముపాలెం, నూజెండ్ల, ఐనవోలు, పాత ఉప్పలపాడు, కంభంపాడు గ్రామాల్లో వైసీపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు వాగ్వాదాలకు దిగటంతో ఘర్షణ వాతావరణం నెలకుంది. కొన్ని చోట్ల పోలీసులు లాఠీ చార్జ్ చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. నూజెండ్లలో దొంగ ఓట్లు వేశారని వైసీపీ, టీడీపీ నేతల ఆరోపణల నేపథ్యంలో జరిగిన ఘర్షణల్లో వైసీపీ కార్యకర్తలు రాళ్ళు విసరటంతో పోలింగ్ స్టేషన్ పక్క గృహం వద్ద ఉన్న వెలగటూరి త్రివేణికి రాయి తగలటంతో చెవి వెనుక భాగంలో గాయమైంది. అదేవిధంగా పాత ఉప్పలపాడులో జరిగిన ఘర్షణలో జీ నందీశ్వరరెడ్డి తలకు తీవ్ర గాయమైంది. రాజకీయంగా చైతన్య వంతంగా ఉన్న గ్రామాల్లో పోలింగ్ స్టేషన్‌ల వద్ద పోలీసు సిబ్బంది తక్కువగా ఉండటంతో ఘర్షణలు అదుపు చేసేందుకు పోలీసులకు కష్టంగా మారింది. మరోసారి ఓటు హక్కు వినియోగించుకుంటున్న యువత బాధ్యతాయుతంగా ఓటు హక్కు వినియోగించుకున్నామని పేర్కొన్నారు. పోలింగ్ ఆలస్యమవుతుందని పోలింగ్ సిబ్బంది చదువుకున్న వారిచేత వేలి ముద్రలు వేయించటం తమకు నచ్చలేదని యువత అభిప్రాయం వ్యక్తం చేశారు. నూజెండ్ల రాత్రి 8 గంటల వరకు కూడా వైసీపీ, టీడీపీ నాయకులు బలాబలాలను ప్రదర్శించుకొనేందుకు ప్రధాన కూడళ్ళకు వద్దకు రావటంతో ఉద్రిక్తత కరమైన వాతావరణం నెలకుంది. మండలంలోని ఎన్నికల నిర్వాహణకు ఆరు రూట్లలో ప్రత్యేకంగా సెక్టార్, రూట్ అధికారులను కేటాయించారు. ఐనవోలు ఎస్ఐ ఎం లక్ష్మీనారాయణరెడ్డి మొబైల్ పార్టీలతో ఘర్షణ జరిగిన ప్రదేశాలకు వెళ్ళి ఘర్షణలను నివారించారు.



నరసరావుపేట మండలం పమిడిపాడులో గాయపడిన వ్యక్తికి ప్రథమ చికిత్స చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, కావూరులో గాయపడిన ఉమామహేశ్వరరావు





నరసరావుపేట మండలం పమిడిపాడులో ఘర్షణకు దిగుతున్న వైసీపీ, టీడీపీ కార్యకర్తలు, అడ్డుకుంటున్న పోలీసులు

మార్పునకు సంకేతమే భారీ ఓటింగ్

కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి



ఓటువేస్తున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, మే 13: రాష్ట్ర వ్యాప్తంగా పోటెత్తిన ఓటింగ్‌తో అనేక స్థానాల్లో వైసీపీకి డిపాజిట్లు గల్లంతు కావటం ఖాయం అని మాజీమంత్రి, కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. సోమవారం పట్టణంలోని 151 పోలింగ్ కేంద్రం భారతరత్న ఇందిరా గాంధీ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో ఆయన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంత భారీఎత్తున ఓటింగ్ నమోదవ్వటం మార్పునకు సంకేతంగానే భావిస్తున్నామని, ప్రజలు ఎంత బలంగా మార్పును కోరుకుంటున్నారో పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన క్యూలైన్‌లను చూస్తే అర్థమైందన్నారు. ఈ ప్రజా వ్యతిరేక పవనాల్లో జగన్‌రెడ్డి, వైసీపీ కొట్టుకుపోవటం ఖాయం అన్నారు. తండోపతండాలుగా తరలివచ్చిన ఓటర్లను చూస్తే చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రకృతి కూడా సహకరించి ఎండ తీవ్రత తక్కువగా ఉండటంతో ఓటింగ్ శాతం మరింత పెరిగేందుకు కలసి వచ్చిందన్నారు. తాను ఎన్నికల్లో ఆరవ సారి పోటీ చేస్తున్నానని, ఉదయం 6 గంటలకే క్యూలైన్‌లలో ఇంత పెద్దఎత్తున ఓటర్లు పాల్గొనటం తొలిసారిగా చూశానన్నారు. పల్నాడు ప్రాంతంలో మాచర్ల, సత్తెనపల్లి, గురజాలతో పాటు చిలకలూరిపేటలో కూడా సాతులూరు, చందవరం, గొరిజవోలు, బుక్కాపురం, గంగన్నపాలెం, పట్టణ పరిధిలోని పురుషోత్తమపట్నం, నరసరావుపేట నియోజకవర్గంలో వైసీపీ గూండాలు దౌర్జన్యాలకు పాల్పడ్డారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదిఏమైనా ఏకపక్ష ఎన్నికలు జరుగుతున్నాయని, జూన్ 4న ఫలితాల్లో అదే వెల్లడవుతుందని, వైసీపీ ఇంటికిపోవటం, టీడీపీ కూటమి ఏర్పాటవ్వటం ఖాయమని ప్రత్తిపాటి వివరించారు. కాగా అక్కడే ఏర్పాటుచేసిన 149 పోలింగ్‌బూత్‌లో ప్రత్తిపాటి కుటుంబసభ్యులు వెంకటకుమారి, శరత్‌బాబులు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

సీబీఎస్ఈ పరీక్షా ఫలితాలలో నవోదయ విద్యార్థుల ప్రతిభ

చిలకలూరిపేట, మే 13: చిలకలూరిపేట మండంలోని మద్దిరాలలో గల జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థులు సోమవారం విడుదల చేసిన 10వ తరగతి, 12 వ తరగతి పరీక్షా ఫలితాలలో నూరు శాతం ఉత్తీర్ణులైనట్లు విద్యాలయం ప్రిన్సిపల్ ఎం.నరసింహరావు తెలిపారు. 10వ తరగతి విద్యార్థి కురేటి రాంతేజ మొత్తం 500 మార్కులకు గాను 481 మార్కులు సాధించి ప్రథమ స్థానం పొందారు. 12వ తరగతి సైన్స్ గ్రూపు నుంచి ఎం.శివనారాయణ 96.2% సాధించి ప్రథమ స్థానం పొందారు.